# సర్కారు వారి పాట!

**రియల్ మార్కెట్‌ను షేక్ చేస్తున్న రేట్లు**

## కోకా పేట.. కోట్లా పేట.. ఎకరా రూ.137కోట్లు

- ఇండియన్ రియల్ మార్కెట్ లో హైదరాబాద్ వండర్స్
- తగ్గేదెలే అంటున్న బిల్డర్స్.. నియోపోలిస్, రాయదుర్గంలో జోరు
- వెస్ట్ హైదరాబాద్ క్రేజ్ కు షాకవుతున్న ఇండస్ట్రీ
- నియోపోలీస్ రికార్డులు కొత్త స్థాయికి.. రూ.5వేల కోట్లు టార్గెట్ గా సర్కారు వేలాలు

02

కోకాపేట లో.. కో అంటే వందల కోట్ల అయిపోతున్నాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మరోసారి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను షాక్‌కు గురిచేసింది. హెచ్ ఎండిఏ నిర్వహించిన నియోపోలిస్-కోకాపేట్ వేలాల్లో నమోదైన రికార్డు ధరలు వెస్ట్ హైదరాబాద్ గ్రోత్ కు, డిమాండ్ కు అద్దం పడుతున్నాయి. నియోపోలిస్ దగ్గర సోమవారం నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి రేటుకు ప్లాట్లు అమ్ముడుపోయాయి. ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. హెచ్ ఎండీఏ అధికారులు ప్లాట్ నెంబర్ 17, 18కి ఈ వేలం నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్లాట్ నెం. 17లో 4.59 ఎకరాలు ఉండగా ఈ వేలంలో ఎకరానికి రూ. 136.50 కోట్లు పలికింది. ప్లాట్ నెం 18లో 5.31 ఎకరాలు ఉండగా ఎకరానికి రూ.137.25 కోట్లు పలికింది. వేలంలో 9.90 ఎకరాలకుగాను హెచ్ ఎండీఏకి రూ.1,355.33 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28వ తేదీన హెచ్ ఎండీఏ అధికారులు వేలం వేయనున్నారు. - మహా, హైదరాబాద్

### కోకాపేటలో క్రేజీ బిడ్స్ - కొత్త చరిత్ర

| | | | |
|---|---|---|---|
| ప్లాట్ నెం.17 (ఎకరాల్లో) | 4.59 | 136.50 | ఎకరాకు ధర (రూ.కోట్లలో) |
| ప్లాట్ నెం.18 (ఎకరాల్లో) | 5.31 | 137.25 | ఎకరాకు ధర (రూ.కోట్లలో) ఇది ఇప్పటివరకు హెచ్ఎండీఏ చరిత్రలోనే అత్యధిక రేటు |
| మొత్తం 9.90 ఎకరాలకు హెచ్ఎండీఏ ఆదాయం (రూ.కోట్లలో) | 1,355 | 177 | రాయదుర్గం రికార్డుల కింగ్ (ఎకరాకు రూ.కోట్లలో టచ్) |

కోకాపేట రికార్డులు ఉధృతమవుతున్న వేళ, పక్కనే ఉన్న రాయదుర్గం ప్రాంతంలో ఇటీవల ఓ ప్రత్యేక వేల ప్రక్రియలో **ఎకరాకు దాదాపు రూ.177 కోట్లు** ధర పలికింది.




ANN తెలుగు

Follow: @ANNTELUGU

25-11-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 337 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


## సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

### 2027 ఫిబ్రవరి వరకు కొనసాగింపు

- హరియాణా నుంచి ఈ పదవి చేపట్టిన తొలి వ్యక్తిగా రికార్డు
- ప్రమాణ స్వీకారానికి హాజరైన ఆరు దేశాల సీజేఐలు



**ఢిల్లీ, మహా:** సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేశారు. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా రికార్డు సృష్టించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిస్సార్ జిల్లాలో మిగతా 2లో

**టాప్ న్యూస్**

### పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుంది

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కవిత వార్నింగ్
- ఒక్కసారి మంత్రి అయి మూడు ఫాంహౌజ్ లు కట్టాడు



02

### నువ్వో లిక్కర్ రాణి

- కేసీఆర్ కూతురు కాబట్టే నీకు గౌరవం ఇస్తున్నా
- నీకు గండిపేటలో విలాసవంతమైన ఫామ్ హౌస్.. పైసలు ఎక్కడివి?
- కవితకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కౌంటర్



02

### అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి

- కాషాయ ధ్వజం ఎగరేయనున్న ప్రధాని మోదీ



03



### మహిళల కబడ్డీ ప్రపంచకప్ విజేతగా భారత్

**వరుసగా రెండోసారి టైటిల్**

**మహా :** మహిళల కబడ్డీ ప్రపంచకప్ విజేతగా నిలిచి భారత్ జట్టు చరిత్ర సృష్టించింది. వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా అవతరించింది. సోమవారం బంగ్లాదేశ్‌లోని ఢాకా వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చైనీస్ తైపీ జట్టును మట్టికరిపించి టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. మిగతా 2లో



### ప్రపంచంలోనే ఎత్తైన శివలింగం

- 200 టన్నుల ఏకశిలతో.. 96 చక్రాల రథంపై యాత్ర
- విరాట్ రామాయణ ఆలయం కోసం మహా శివలింగం తమిళనాడు నుండి బీహార్ కు..

వివరాలు 3లో



# ఢిల్లీకి నోయిడాలా.. తెలంగాణకు కొడంగల్

## రూ. 5,000 కోట్ల నిధుల్ ధమాకా

- విద్య, సాగునీటి ప్రాజెక్టులపై సీఎం వరాలు
- 'దశదిశ' మార్చేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు
- మెడికల్, వెటర్నరీ, వ్యవసాయ కాలేజీలు ఏర్పాటు చేయబోతున్నాం
- ఇరిగేషన్ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి.. ప్రతి ఎకరాకు నీరివ్వడమే లక్ష్యం
- సొంత నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు

**కొడంగల్, మహా:** దేశ రాజధాని ఢిల్లీ పక్కన ఉన్న నోయిడా మాదిరిగా కొడంగల్‌ను తెలంగాణ నోయిడాగా తీర్చిదిద్ది, అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామని, ఇక్కడ రైల్వే మార్గం, సిమెంట్ పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చేందుకు రూ. 5 వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో సోమవారం పర్యటించారు. గడిచిన 70 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ నియోజకవర్గాన్ని దేశం నలుమూలల నుంచి వచ్చి చూసేలా అభివృద్ధి చేసి, 2034 నాటికి దేశంలోనే ఒక ఆదర్శవంతమైన శాసనసభ నియోజకవర్గంగా తీర్చిదిద్దుకుందామని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం కొడంగల్‌లో హరేకృష్ణ ఉద్యమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధునిక అల్పాహార వంటశాలలను పరిశీలించిన ముఖ్యమంత్రి, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మధ్యాహ్న భోజన వంటశాల భవన నిర్మాణానికి మిగతా 2లో

## ఆయుధాలు వదిలేస్తాం

- కూంబింగ్ ఆపేస్తే.. కాల్పుల విరమణ పాటిస్తాం
- మా అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తామని హామీ ఇస్తున్నాం
- మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన
- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులకు లేఖ

**ఛత్తీస్‌గఢ్, మహా:** ఆయుధాలు వదిలేసి, జన జీవన స్రవంతిలో కలవడంపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. కూంబింగ్ ఆపేస్తే ఆయుధాలు వదిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులకు మావోయిస్టులు లేఖ రాశారు. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు ఇప్పటికే సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. మిగతా 2లో








## మహిళా సంక్షేమానికి పెద్దపీట

- మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయడమే సర్కార్ లక్ష్యం
- ఉచిత బస్సు రవాణా కల్పిస్తే ప్రతిపక్షాలు తట్టుకోలేక విమర్శిస్తున్నారు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**పెద్దపల్లి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని స్వరూప గార్డెన్స్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ మిగతా 2లో



## దసరాకు ఇవ్వాల్సిన చీరలు ఇప్పుడెందుకు?

### ఎన్నికల కోసమే మహిళలకు ముతక చీరలు

- కాంగ్రెస్ చిత్తశుద్ధి ఉంటే ఎలక్షన్స్ అప్పుడే ఎందుకు నిర్వహించలేదు?
- హామీలకు దిక్కులేక కేంద్రం నిధుల కోసం కక్కుర్తి పడుతున్నారా?
- ప్రభుత్వంపై ఎంపీ డీకే అరుణ ఫైర్



**మహబూబ్‌నగర్, మహా:** రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరలు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేస్తోందని మిగతా 2లో

ANN తెలుగు
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ | 25-11-2025
జనరల్ న్యూస్ | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM


# సర్కారు వారి పాట!

## రియల్ మార్కెట్‌ను షేక్ చేస్తున్న రేట్లు

### కోకా పేట.. కోట్లా పేట.. ఎకరా రూ.137కోట్లు

ఇండియన్ రియల్ మార్కెట్ లో హైదరాబాద్ వండర్స్

తగ్గేదెలే అంటున్న బిల్డర్స్.. నియోపోలిస్, రాయదుర్గంలో జోరు

వెస్ట్ హైదరాబాద్ క్రేజ్ కు షాకవుతున్న ఇండస్ట్రీ

నియోపోలీస్ రికార్డులు కొత్త స్థాయికి.. రూ.5వేల కోట్లు టార్గెట్ గా సర్కారు వేలాలు

**హైదరాబాద్, మహా :** కోకాపేట లో.. కో అంటే వందల కోట్లు అయిపోతున్నాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మరోసారి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను షాక్‌కు గురిచేసింది. హెచ్ ఎండిఏ నిర్వహించిన నియోపోలిస్‌కోకాపేట్ వేలాల్లో నమోదైన రికార్డు ధరలు వెస్ట్ హైదరాబాద్ గ్రోత్ కు, డిమాండ్ కు అద్దం పడుతున్నాయి. నియోపోలిస్ దగ్గర సోమవారం నిర్వహించిన వేలంలో రికార్డు స్థాయి రేటుకు ప్లాట్లు అమ్ముడుపోయాయి. ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. హెచ్ ఎండీఏ అధికారులు ప్లాట్ నెంబర్ 17, 18కి ఈ వేలం నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్లాట్ నెం. 17లో 4.59 ఎకరాలు ఉండగా ఈ వేలంలో ఎకరానికి రూ. 136.50 కోట్లు పలికింది. ప్లాట్ నెం 18లో 5.31 ఎకరాలు ఉండగా ఎకరానికి రూ.137.25 కోట్లు పలికింది. వేలంలో 9.90 ఎకరాలకుగాను హెచ్ ఎండీఏకి రూ.1,355.33 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28వ తేదీన హెచ్ ఎండీఏ అధికారులు వేలం వేయనున్నారు. కాగా నియోపోలీస్ లేఅవుట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడుతున్నాయి. అంతేకాకుండా, ఇక్కడ ఎన్ని అంతస్తులు నిర్మించాలన్నదానిపై పరిమితి కూడా లేదని తెలుస్తోంది. ఫ్లోర్స్ విషయంలో లిమిట్ లేకపోవడంతో కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ అటు ఓఆర్ఆర్ కు ఇటు రాయదుర్గం ఐటీ కంపెనీలకు దగ్గరగా ఉండటంతో కోకాపేట భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ఒక్క వేలం ద్వారా కోకాపేట రియల్ ఎస్టేట్ విలువలు 'పీక్' లో ఉన్నాయనీ, నీయోపోలిస్ హబ్ దేశంలో అత్యంత ఖరీదైన ప్రీమియం కారిడార్‌గా మారిందనీ స్పష్టమైంది. నీయోపోలిస్ రికార్డులు రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్లాయి



### రాయదుర్గంకు ఎందుకు ఈ విలువ?

ఇది హైదరాబాదు ఐటీ కోర్‌లోని సూపర్ ప్రీమియం జోన్ అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐటీ కారిడార్‌కు అత్యంత దగ్గర మెట్రో కారిడార్, షార్ట్ డిస్టన్స్ ఆర్బిటల్ రోడ్, బహుళ జాతీయ కంపెనీల హబ్ కోకాపేట–రాయడుర్గం–రైడూర్గం బెల్ట్ ఇప్పుడు భారతదేశంలోనే అత్యంత ఖరీదైన కారిడార్* గా మారుతోంది. పెట్టుబడిదారులు, అంతర్జాతీయ డెవలపర్లు ఈ ప్రాంతాన్ని "భవిష్యత్ ఇండియా కార్పొరేట్ హార్ట్‌బీట్"గా చూస్తున్నారు

#### నియోపోలిస్ - రాయడుర్గం - డబుల్ ఇంజిన్ బూమ్

కోకాపేట వికాసం ఒక వైపు, రాయదుర్గం బిజినెస్ రేసు మరో వైపు — ఈ రెండు ప్రాంతాలు కలిసి హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను కొత్త దిశగా నడిపిస్తున్నాయి.

#### రెండు ప్రాంతాల్లో కలిపి ఉన్న ప్రత్యేకతలు

- ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు నిమిషాల దూరం
- ఓఆర్ఆర్ కనెక్టివిటీ
- భారీ కార్పొరేట్ టవర్స్ అవకాశాలు
- డేటాసెంటర్ హబ్‌గా మారే సామర్థ్యం

### రాబోయే వేలాలు

హెచ్‌ఎండీఏ ప్రకటించిన ప్రకారం:

- కోకాపేటలో మిగిలిన ప్లాట్లు నవంబర్ 28న వేలానికి
- డిసెంబర్ 3, 5 తేదీల్లో కొత్త వేలాలు
- ఈ సిరీస్ ద్వారా రూ.5,000 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం
- రాయదుర్గం, మూసాపేట, గోల్డెన్ మైల్ ప్రాంతాల్లో కూడా ధరలు రెట్టింపవుతాయన్న అంచనాలు మార్కెట్‌లో వినిపిస్తున్నాయి.

# దసరాకు ఇవ్వాల్సిన చీరలు ఇప్పుడెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ డి.కె. అరుణ విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇన్నాళ్లు ఇందిరమ్మ గుర్తుకు రాలేదా, ఎన్నికలు వస్తున్నాయని ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఉండివుంటే స్థానిక సంస్థల పదవీకాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండేదని అన్నారు. రాష్ట్రం దివాళా తీయడంతో, కేంద్రం నుంచి రావాల్సిన రూ. 3 వేల కోట్ల నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళుతున్నదని ఆమె ఆరోపించారు. ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి, ఎన్నికల్లో గెలవాలనే తపనతోనే ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ చీరల తాయిలాలను అందిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు, మహిళలు, చేనేత కార్మికులు, రైతులు, వికలాంగులకు ఇచ్చిన హామీలను మరిచిపోయి, కేవలం రూ. 300 విలువ చేసే ముతక చీరలు తీసుకుని కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపిస్తే ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీసే వారు ఉండరని ప్రజలకు సూచించారు. దమ్ముంటే పాలమూరు జిల్లాలో రోడ్లు బాగు చేయాలని ఆమె ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. రిజర్వేషన్ల గందరగోళంపై మాట్లాడుతూ, 2011 జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీ సర్పంచ్ రిజర్వేషన్లు, 2024 సర్వే ప్రకారం వార్డు మెంబర్ రిజర్వేషన్లు ఇవ్వడంపై ఆమె ప్రశ్నించారు. పార్టీ గుర్తులపై సర్పంచులు గెలవనప్పుడు, పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా ఇస్తారని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో 'నాకు కొడంగల్ నారాయణపేట హైదరాబాద్‌సికింద్రాబాద్ ఎలానో' అన్న మాట ఏమైందని, ఒక్క కొడంగల్‌కు రోడ్లు వేసుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. జిల్లా వాసికి ముఖ్యమంత్రి అవకాశం వచ్చినా ఇక్కడి ప్రజలకు ఒరిగింది ఏముందని, ఇది గతంలో ఉన్న కేసీఆర్‌కు, మీకు తేడా లేనట్లేనని విమర్శించారు. నారాయణపేట జిల్లాలో జిల్లా ఆసుపత్రి సమస్య తీవ్రంగా ఉందని, పేరుకే పెద్ద ఆసుపత్రి అయినా సరైన వైద్యం అందడం లేదని విమర్శించారు. వెంటనే జిల్లా కేంద్రంలో ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి సూచిస్తానని తెలిపారు.

# ఢిల్లీకి నోయిడాలా.. తెలంగాణకు కొడంగల్

(మొదటిపేజీ తరువాయి)

భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రూ. 103 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేసి, సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు చెక్కులు, చీరలను పంపిణీ చేశారు.

**విద్య, నీటి పారుదల రంగాలను అభివృద్ధి..**

ఆ తరువాత ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, కొడంగల్‌ను ఒక మోడల్ నియోజకవర్గంగా మార్చే ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్య, నీటి పారుదల రంగాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని, అందుకు కొడంగల్‌ను ప్రయోగశాలగా ఎంచుకున్నామని చెప్పారు. అక్షయపాత్ర సహకారంతో నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లో చదువుకుంటున్న 28 వేల మంది విద్యార్థులకు ఆకలితో చదువుపై శ్రద్ధ కోల్పోకుండా ఉండేందుకు ప్రతి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

**కొడంగల్‌ను తెలంగాణ నోయిడాగా..**

మెడికల్ కాలేజ్, వెటర్నరీ, వ్యవసాయ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్ వంటి వాటితో



పాటు రాష్ట్రంలో మొట్టమొదటి సైనిక్ స్కూల్‌ను కొడంగల్‌లో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. అలాగే, కృష్ణా నది జలాలతో కరువు ప్రాంతాలైన కొడంగల్, మక్తల్, నారాయణపేటలోని ప్రతి ఎకరాకు నీరివ్వడానికి రూ. 5 వేల కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభిస్తామన్నారు. భూసేకరణకు 95 శాతం మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, మంత్రివర్గ ఆమోదం పొందిన వెంటనే మూడు నెలల్లో పనులు మొదలవుతాయని చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీ పక్కన ఉన్న నోయిడా మాదిరిగా కొడంగల్‌ను తెలంగాణ నోయిడాగా తీర్చిదిద్ది, అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తామని, ఇక్కడ రైల్వే మార్గం, సిమెంట్ పరిశ్రమలు స్థాపించి ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని 300 కోట్ల రూపాయల చెక్కును అందించారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



# మహిళల కబడ్డీ ప్రపంచకప్ విజేతగా భారత్

## వరుసగా రెండోసారి టైటిల్

(మొదటిపేజీ తరువాయి)

ఫైనల్‌లో భారత్ - చైనీస్ తైపీ జట్టును 3528 తేడాతో చిత్తు చేసింది. దీంతో వరుసగా రెండోసారి కబడ్డీ ప్రపంచకప్ టైటిల్ సాధించి.. భారత మహిళల జట్టు సరికొత్త చరిత్రను లిఖించింది. ఈ టోర్నమెంట్ బంగ్లాదేశ్ వేదికగా జరిగింది. లీగ్ స్టేజ్‌లో ఓటమి అనేది లేకుండా భారత మహిళల జట్టు సెమీ ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్‌లో ఇరాన్‌ను 33-21 పాయింట్ల తేడాతో చిత్తు చేసింది. మరోవైపు చైనీస్ తైపీ కూడా ఓటమి అనేది లేకుండా నాకౌట్‌కు చేరుకుంది. ఆ జట్టు సెమీస్‌లో 25-18 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలుపొంది.. ఫైనల్‌కు చేరుకుంది. భారత్, చైనీస్ తైపీ జట్లు అజేయంగా తుది పోరుకు అర్హత సాధించాయి. టోర్నీలో భారత జట్టు విజయంలో కెప్టెన్ రీతు నేగి, వైస్ కెప్టెన్ పుష్ప రాణా కీలక పాత్ర పోషించారు. రీతు రైడింగ్‌లో సత్తాచాటగా, పుష్ప రాణా డిఫెన్స్‌లో అదరగొట్టింది. దీంతో భారత్.. ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చలాయించింది.

# పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుంది

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కవిత వార్నింగ్

### ఒక్కసారి మంత్రి అయి మూడు ఫాంహౌజ్ లు కట్టాడు

**వనపర్తి, మహా :** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన తండ్రి వయసు వారని ఇన్నాళ్లు తాను ఏమి అనలేదని కానీ ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడితే ఊరుకునేది లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తనను ఉద్దేశించి పుచ్చువంకాయ, సచ్చు వంకాయ అని నిరంజన్ రెడ్డి మాట్లాడుతున్నారట.. ఇన్నాళ్లు మీ వయసును గౌరవించాను. ఇంకోసారి నాపై పిచ్చి పిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుందని ఘాటుగా హెచ్చరించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఇవాళ వనపర్తిలో మీడియాతో మాట్లాడిన కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. మనుషులను పెట్టించి నాపై మాట్లాడిస్తున్నా చాలా రోజులుగా మౌనంగా ఉన్నాను. నా పని నేను చేసుకుంటూ వెళ్తుంటే ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దు. ఒళ్లు దగ్గర పెట్టుకుని చేసిన ఆరోపణలపై సమాధానాలు ఇవ్వాలన్నారు. నా గురించి మీకేం తెలుసని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అవినీతి, అక్రమాల వల్ల వనపర్తి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని నిరంజన్ రెడ్డి అవినీతి గురించి కేసీఆర్ కు తెలియదా? లేదా ఈ అవినీతి కేసీఆర్ వరకు వెళ్లకుండా హరీశ్ రావు కాపాడారా అని నిలదీశారు. నిరంజన్ రెడ్డి అవినీతి కేసీఆర్ కు ఇప్పటి వరకు తెలియదనే తాను అనుకుంటున్నానని ఇవాళ మీడియా ముఖంగా నిరంజన్ రెడ్డి అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తున్నానని ఇక్కడ ఏ చిన్న పిల్లాడిని కదిలించి నా నిరంజన్ రెడ్డి అరాచకలు చెబుతున్నారని అన్నారు. నిరంజన్ రెడ్డి లాంటి నాయకులను ప్రజలమీద రుద్ది ఉద్యమకారులను ఇబ్బంది పెట్టడం ఎందుకని కవిత ప్రశ్నించారు. నిరంజన్ రెడ్డి లాంటి మనుషులు రాజకీయాల్లో ఉండకూడదన్నారు. నిరంజన్ రెడ్డి బీసీలు,



ఉద్యమకారులపై పెట్టిన కేసుల గురించి బాధితులు చెప్పుకుంటూ బాధితులు ఏడుస్తున్నారన్నారు.

**హరీశ్ మనిషి కాబట్టే నిరంజన్ పై చర్యల్లేవ్**

ఒక్కసారి మంత్రి అయిన నిరంజన్ రెడ్డి మూడు ఫామ్ హౌస్ లు కట్టుకున్నారని ఇందులో అసైండ్ భూములు కూడా ఉన్నాయని, కృష్ణా నది కాలువ ఆయన ఫామ్ హౌస్ లోనుంచి వెళ్తోందని చెబుతున్నారని కవిత ఆరోపించారు. ఈ బీఆర్ఎస్ తో తనకు సంబంధం లేదని అయినా ఉద్యమకారులు ఆ పార్టీలో ఉండలేక మింగలేక చస్తున్నారని చెప్పారు. నిరంజన్ రెడ్డి స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని కాలబెడుతుంటే కూడా చూస్తూ ఉండిపోయారట. ఈ విషయం నిజంగా కేసీఆర్ కు తెలిసి కూడా మౌనంగా ఉంటే మాత్రం ఇది వంద శాతం తప్పు అవుతుందన్నారు. ప్రజలు మంచి తీర్పు ఇచ్చారని ఇంక ఘోరంగా మిమ్మల్ని ఓడించాల్సిందన్నారు. ప్రజా సమస్యలపై నేను మాట్లాడుతుంటే మీకెందుకు భయం అవుతోందని మండిపడ్డారు. భూదహానికి, ధనదాహానికి హద్దు ఉండాలి కదా అన్నారు. నిరంజన్ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మీ మధ్య ఉన్న అవగాహన ఏమిటి అని ప్రశ్నించారు. హరీశ్ రావు మనిషి కావడం వల్లే నిరంజన్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తాను బలంగా నమ్ముతున్నానన్నారు.

# సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

జన్మించారు. 1981లో డిగ్రీ పూర్తి చేశారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అదే సంవత్సరం హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించారు. 1985లో పంజాబ్, హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రెండు దశాబ్దాలుగా వివిధ ధర్మాసనాల్లో పని చేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగమయ్యారు.

**జస్టిస్ సూర్యకాంత్ కీలక తీర్పులు**

**1. ఆర్టికల్ 370 పై చారిత్రాత్మక తీర్పు**

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దు చేసే నిర్ణయాన్ని సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఒకరు. ఈ తీర్పు గత కొన్ని సంవత్సరాలలో అత్యంత చర్చనీయాంశమైన రాజ్యాంగ నిర్ణయాలలో ఒకటి.

**2. దేశద్రోహ చట్టంపై స్టే**

సెక్షన్ 124ఏ (దేశద్రోహం) పై స్టే విధించారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని సమీక్షించే వరకు దానిని అమలు చేయవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించిన ధర్మాసనంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు.

**3. పెగాసస్ స్పైవేర్ వివాదం**

పెగాసస్ స్పైవేర్ కేసులో జస్టిస్ సూర్యకాంత్ విచారణ కోసం సైబర్ నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నవారిలో ఒకరు. జాతీయ భద్రత పేరుతో ప్రభుత్వానికి అపరిమిత



అధికారాలు ఇవ్వలేమని కోర్టు స్పష్టం చేసింది.

**4. బిహార్ ఓటర్ల జాబితా వివాదం**

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి ఓటర్ల జాబితా నుండి తొలగించిన 65 లక్షల మంది పేర్ల పూర్తి వివరాలను బహిరంగపరచాలని ఆయన ఎన్నికల సంఘానికి ఆదేశించడం తెలిసిందే.

**5. మహిళల హక్కులు, స్థానిక సంస్థల పాలన**

ఒక మహిళా సర్పంచ్‌ను పదవి నుండి తొలగించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ ఆమె పదవిని జస్టిస్ సూర్యకాంత్ పునరుద్ధరించారు. మహిళలపై వివక్షతను అంగీకరించలేమని తన తీర్పులో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్తో సహా అన్ని బార్ అసోసియేషన్లలో 1/3 సీట్లను మహిళలకు రిజర్వ్ చేయాలని సూచించారు. ఇది ఒక చారిత్రాత్మక చర్యగా పరిగణిస్తారు.

**6. గవర్నర్, రాష్ట్రపతి అధికారాలపై పరిశీలన**

ఇటీవల గవర్నర్, రాష్ట్రపతికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని విషయాల్లో ప్రశ్నలు లేవనెత్తున్నాయి. గవర్నర్, రాష్ట్రపతి అధికారాలకు సంబంధించిన ముఖ్యమైన కేసులను విచారిస్తున్న రాజ్యాంగ ధర్మాసనంలో ఆయన ఒకరు. అయితే దీనిపై ఇంకా నిర్ణయం రావాల్సి ఉంది.

# నువ్వో లిక్కర్ రాణి

## కేసీఆర్ కూతురు కాబట్టే నీకు గౌరవం ఇస్తున్నా..

- నీకు గండిపేటలో విలాసవంతమైన ఫామ్ హౌస్.. పైసలు ఎక్కడివి?
- కవితకు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు తనపై చేసిన కామెంట్స్ పై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్పందించారు. తాను నీళ్ల నిరంజన్ రెడ్డి అని పిలిపించుకోలేదని.. నువ్వే లిక్కర్ రాణి అని పిలిపించుకున్నావు అని కవితను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నువ్వు ఎత్తకపోతే బోనమే లేనట్టు, నువ్వు ఆడక పోతే బతుకమ్మే లేనట్టు దురహంకారంతో ప్రవర్తిస్తున్నావు అని ధ్వజమెత్తారు. సోమవారం మీడియాతో మాట్లాడిన కవిత కౌంటర్ వేశారు. ఓట్ల కోసం తండాల్లో తిరుగుతుంటుంటే.. మీ కేసీఆర్ బిడ్డ సారా దందా చేస్తే ఏం కాదు కానీ.. మేము సారా కాస్తే అరెస్టు చేయిస్తారా అని తనను లంబాడా మహిళలు నిలదీశారని తెలిపారు.

కేసీఆర్ కూతురు కాబట్టే నీకు ఇంకా గౌరవం ఇస్తూ మాట్లాడుతున్నామని.. ఆ గౌరవాన్ని నువ్వు కాపాడుకోవడం లేదని కవితను విమర్శించారు. తాము కేసీఆర్ కు మంచి పేరు తెస్తుంటే.. ఆయనను మానసికంగా వేధిస్తున్నావని దుయ్యబట్టారు. ఎవరిని సంతోషపెట్టడానికి కవిత నాపై ఆరోపణలు చేస్తుందని ప్రశ్నించారు. నీ అహంకారం.. చర్యలు కేసీఆర్ ఓటమికి ప్రధాన కారణమయ్యాయని సంచలన ఆరోపణలు చేశారు. నాకు ఒక్క వ్యవసాయ క్షేత్రం మాత్రమే ఉంది.. గండిపేట



లో విలాసవంతమైన ఫామ్ హౌస్ లేదా? అన్ని పైసలు ఎక్కడివి? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. తండ్రి వయసు ఉన్న ఎమ్మెల్యేలను ఇంటికి పిలిపించుకుని.. జాగృతిలో చేరాలని కవిత అడిగిందన్నారు. ఒప్పుకోని నా లాంటి వాళ్ల మీద ఆరోపణలు సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. కాగా, వనపర్తిలో జాగృతి జనం బాటలో ఉన్న ఎమ్మెల్సీ కవిత.. మాజీ మంత్రిపై తీవ్ర ఆరోపణలు చేశారు. పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే పుచ్చలు లేచిపోతాయని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. జిల్లాలో నిరంజన్ రెడ్డి అవినీతి పరాకాష్టకు చేరుకుందని ఆరోపించారు.

# మహిళా సంక్షేమానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో ఆయన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు రవాణా కల్పిస్తే ప్రతిపక్షాలు తట్టుకోలేక విమర్శిస్తున్నారని, దీనిని జూబ్లీహిల్స్ మహిళలు తిప్పి కొట్టారని అన్నారు. గత 10 సంవత్సరాల పాలనలో వడ్డీ లేని రుణాల గురించి ఆలోచన రాలేదని, తమ ప్రభుత్వం 5 సంవత్సరాల కాలంలో లక్ష కోట్ల రూపాయలు బ్యాంకు లింకేజ్ ద్వారా వడ్డీ లేకుండా మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లాలో మొదటి ఏడాది రూ. 9 కోట్లు విడుదల చేశామని, ప్రస్తుత సంవత్సరం మరో రూ. 10 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

**పాఠశాలల రూపురేఖలు మారుస్తాం..**

2047 తెలంగాణ రైసింగ్ పాలసీలో భాగంగా మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ కోటీశ్వరులను చేసేందుకు చర్యలు చేపట్టామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మహిళలకు ప్రత్యేకంగా పారిశ్రామిక వాడలలో భూముల కేటాయింపు ఆలోచన చేస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాల కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు రూ. 2 లక్షల పంట రుణమాఫీ, ఎకరానికి రూ. 12,000 పెట్టుబడి సహాయం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను బాగు చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని, పాఠశాలల రూపురేఖలు మారుస్తామని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ రీజినల్ సెంటర్ ఏర్పాటు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రిలో సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ప్రపంచంలోనే ఎత్తైన శివలింగం

- 200 టన్నుల ఏకశిలతో.. 96 చక్రాల రథంపై యాత్ర
- విరాట్ రామాయణ ఆలయం కోసం మహా శివలింగం తమిళనాడు నుండి బీహార్ కు..



**హైదరాబాద్, మహా:** భారతదేశ ఆధ్యాత్మిక చరిత్రలో మరో సువర్ణ అధ్యాయం లిఖించబడుతోంది. భక్తి భావం, శిల్పకళా నైపుణ్యం మేళవింపుతో రూపుదిద్దుకున్న ప్రపంచంలోనే అతిపెద్ద శివలింగం తన గమ్యస్థానానికి బయలుదేరింది. దాదాపు 200 టన్నుల బరువున్న ఈ భారీ కృష్ణ శిలను తమిళనాడు నుండి బీహార్‌కు తరలించడం ఒక ఎత్తైతే, దానిని 96 చక్రాల భారీ లారీపై తీసుకువెళుతుండటం చూపరులను విస్మయానికి గురిచేస్తోంది. పదేళ్ల పాటు శిల్పుల ఉలి దెబ్బలకు ప్రాణం పోసుకున్న ఈ మహా లింగం, త్వరలోనే బీహార్‌లోని విరాట్ రామాయణ ఆలయంలో కొలువుదీరనుంది.

**మహాబలిపురం టు బీహార్**

దక్షిణ భారతదేశం నుండి ఉత్తర భారతదేశానికి ఒక అపురూపమైన ఆధ్యాత్మిక వారధి నిర్మాణం జరుగుతోంది. తమిళనాడులోని మహాబలిపురంలో అత్యంత నైపుణ్యం కలిగిన శిల్పుల చేతుల్లో పదేళ్ల పాటు రూపుదిద్దుకున్న ప్రపంచంలోనే అతిపెద్ద ఏకశిలా శివలింగం, ఎట్టకేలకు తన గమ్యస్థానమైన బీహార్‌కు పయనమైంది. దాదాపు 200 టన్నుల బరువు కలిగిన ఈ భారీ శివలింగం, తూర్పు చంపారన్ జిల్లాలో నిర్మిస్తున్న విరాట్ రామాయణ ఆలయానికి చేరుకునేందుకు తన చారిత్రక ప్రయాణాన్ని ప్రారంభించింది. నవంబర్ 21, 2025 శుక్రవారం రాత్రి మహాబలిపురం నుండి ఈ యాత్ర లాంఛనంగా మొదలైంది. ఈ శివలింగం తయారీ వెనుక దాదాపు ఒక దశాబ్ద కాలం నాటి కఠోర శ్రమ దాగి ఉంది. మహాబలిపురానికి చెందిన నిపుణులైన శిల్పులు 2013 నుండి ఈ బృహత్కార్యంపై పనిచేశారు. విశేషమేమిటంటే, దీని తయారీలో ఎక్కడా యంత్రాలను వాడకుండా, కేవలం సంప్రదాయ పద్ధతిలో చేతి ఉలితోనే ఇంతటి భారీ నల్లరాతి గ్రానైట్‌ను శివలింగంగా మలిచారు. 33 అడుగుల ఎత్తు, 33 అడుగుల చుట్టుకొలతతో ఉన్న దీనిని 'సహస్రలింగం'గా తీర్చిదిద్దారు. అంటే ఒకే లింగంలో వెయ్యి చిన్న లింగాలు ఇమిడి ఉన్నట్లుగా దీని రూపకల్పన జరగడం అద్భుతం. ఇంతటి భారీ విగ్రహాన్ని రవాణా చేయడం కూడా ఒక సవాలుగానే మారింది. 200 టన్నుల బరువున్న ఈ ఏకశిల శివలింగాన్ని సాధారణ వాహనాల్లో తరలించడం సాధ్యం కాకపోవడంతో, వోల్వో కంపెనీకి చెందిన 96 చక్రాల ప్రత్యేక హైడ్రాలిక్ ట్రక్కును దీనికోసం వినియోగిస్తున్నారు. ఈ భారీ వాహనం తమిళనాడు నుండి బయలుదేరి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సుదీర్ఘంగా ప్రయాణించి బీహార్ చేరుకోనుంది. దాదాపు రెండు వేల కిలోమీటర్లకు పైగా సాగే ఈ యాత్రకు 20 నుండి 25 రోజుల సమయం పడుతుందని, లారీ గంటకు కేవలం 5 నుండి 10 కిలోమీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించగలదని రవాణా నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ లారీ వెళ్తున్న మార్గమధ్యంలో భక్తులు దీనిని దర్శించుకునేందుకు బారులు తీరుతున్నారు. ఎలాంటి అవాంతరాలు లేకపోతే డిసెంబర్ 15 నాటికి ఈ శివలింగం బీహార్‌లోని కేసరియాచాకియా ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉంది. పాట్నాకు చెందిన మహావీర్ స్థాన్ న్యాస్ సమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న విరాట్ రామాయణ ఆలయం, కంబోడియాలోని అంకోర్ వాట్ కంటే ఎత్తైనదిగా రికార్డు సృష్టించనుంది. ఈ ఆలయంలోనే ఈ మహా శివలింగాన్ని ప్రతిష్టించనున్నారు. అయితే, శివలింగం డిసెంబర్ నాటికి చేరినప్పటికీ, ప్రతిష్ఠాపన కార్యక్రమం మాత్రం 2026 సంవత్సరం ప్రారంభంలో, ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్నారు. సాధారణంగా భారీ ఎత్తులో ఉండే శివలింగాలకు అభిషేకం చేయడం కష్టసాధ్యం. కానీ, భక్తులు నేరుగా జలాభిషేకం చేసేందుకు వీలుగా ఈ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు మెట్ల ద్వారా పైకి వెళ్లి, లింగం పైభాగంలో నీరు లేదా పాలు పోసేలా దీని పీఠాన్ని వినూత్నంగా డిజైన్ చేశారు. భారీ క్రేన్ల సహాయంతో లారీ నుండి దీనిని దించి, ఆలయంలో ప్రతిష్టించే ఘట్టం కోసం బీహార్ వాసులు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తయితే ఇది భారతదేశ పర్యాటక, ఆధ్యాత్మిక చిత్రపటంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించడం ఖాయంగా కనిపిస్తోంది.

## నాకు అయ్యప్ప స్వామి అంటే అత్యంత ఇష్టం

**అయ్యప్ప పడి పూజ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నివాసంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు అయ్యప్ప నామస్మరణతో పడి పూజ కార్యక్రమం ఆద్యంతం ప్రతి ఒక్కరిని భక్తి పారవశ్యంలో మునిగేలా చేసింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తో కలిసి మంత్రి దర్శించుకున్నారు. మంత్రికి వేద పండితులు ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... "నాకు అయ్యప్ప స్వామి అంటే అత్యంత ఇష్టం. ఇంత మంది అయ్యప్ప భక్తులను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉన్నది. మంచి ఆధ్యాత్మిక భావన కలుగుతుంది. అయ్యప్ప దీక్ష మనిషిలో గొప్ప పరివర్తన తీసుకు వస్తుంది. ఈర్ష్య, ద్వేషాలు, దురలవాట్లు తగ్గి సమాజం పట్ల కరుణ గుణం కలుగుతుంది. భగవంతుడు కూడా చెప్పేది సాటి మనిషిని ప్రేమించమనే కదా. 41రోజుల మండల కఠిన దీక్షలో సాక్షాత్తు అయ్యప్పను మీలో చూస్తాం. చన్నీటి స్నానం, ఒక్క పూట భోజనం, కటిక నేల మీద నిద్ర అయ్యప్ప దీక్షలో కఠిన నియమాలు. వాటిని పాటిస్తూ మండల కాలంలో గొప్ప మార్పు దీక్ష పరుల్లో కల్గుతుంది. అయ్యప్ప స్వామి దయతో రైతులు పాడి, పంటలతో, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్న. ఇంత మంచి ఆధ్యాత్మిక వాతావరణంలో పడి పూజ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గారికి అభినందనలు." అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీర్ల అయిలయ్యతో పాటు అయ్యప్ప స్వాములు మార్కెట్ కమిటీ చైర్మన్, పలువురు నాయకులు అందరూ పాల్గొన్నారు.

# ఆయుధాలు వదిలేస్తాం

**(మొదటిపేజీ తరువాయి)**

డిసెంబర్ 15వ తేదీలోపు ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. ప్రభుత్వాలు స్పందిస్తే మార్చి 31 వరకు కాల్పుల విరమణ పాటిస్తామని తెలిపారు. లేదంటే దాడులు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దేశం, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ ఆయుధాలను త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా ఇటీవల నిర్ణయం తీసుకున్నారని మావోయిస్టు పార్టీ ఆ లేఖలో పేర్కొంది. సోను దాదా తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తున్నామని తెలిపింది. ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం తుపాకులను వదిలేయాలని భావిస్తోందని చెప్పారు. అయితే మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు తమకు ఫిబ్రవరి 15వ తేదీ వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు తమ పార్టీ కట్టుబడి ఉన్నందున ఈ నిర్ణయాన్ని సమష్టిగా చేరుకునేందుకు తమకు కొంత సమయం పడుతుందని మావోయిస్టులు పేర్కొన్నారు. తమ సహచరులను సంప్రదించి పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాలు తెలియజేసేందుకు సమయం కావాలని కోరారు. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలు ఏమీ లేవని స్పష్టం చేశారు. త్వరగా కమ్యూనికేట్ చేసేందుకు తమకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నామని వివరించారు. భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేయాలని కోరారు. పీఎల్‌జీఏ వారోత్సవాన్ని నిర్వహించబోమని... తమ అన్ని కార్యకలాపాలను హామీ ఇస్తున్నామని చెప్పారు.

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కారించాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



**యాదాద్రి భువనగిరి, మహా :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిచ్చి సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు 58 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 41, గ్రామీణాభివృద్ధి శాఖ 4, జిల్లా సంక్షేమ శాఖ 2, మున్సిపాలిటీ 2, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, ఇరిగేషన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా పంచాయతీ, సివిల్ సప్లై, ఆర్టీసీ, ఎంప్లాయిమెంట్ టీం, విద్య శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, హౌసింగ్ పీడీ విజయ సింగ్ ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరల పంపిణీ

**యాదగిరిగుట్ట, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు... ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కుండే సిద్దులుతో పాటు గ్రామ మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ లు నాయకులు పాల్గొన్నారు.

## మందమర్రి పోలీసుల ఆధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపు



**మందమర్రి, మహా :** మందమర్రి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గత కొంతకాలంగా చిర్రకుంట, సారంగపల్లి, ఆవడం గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న సారంగపల్లి, చిర్రకుంట, మందమర్రి, ఆవడం బీటీ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు మొలవడంతో వాహనదారులకు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఇలా విస్తరించిన పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని ఈరోజు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమం కొరకు స్థానిక ప్రజలు, యువకులు సమాచారం ఇవ్వడంతో వారు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసులకు సహకారం అందించారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహకరించిన సారంగపల్లి, చిర్రకుంట గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ నుండి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యతానికి స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ఉపయోగించాలని చెప్పారు. అన్ని రకాల వాహనదారులు నిర్ణీత వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ఊహించని ప్రమాదానికి గురవుతారని చెప్పారు. మద్యం సేవించి వాహనం నడవడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా తమతో ఉంచుకోవాలని పేర్కొన్నారు.



## అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తి

**కాషాయ ధ్వజం ఎగరేయనున్న ప్రధాని మోదీ**

**మహా:** అయోధ్య రామమందిర నిర్మాణం సంపూర్ణం కాగా, మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాషాయ ధ్వజం ఎగరేయనున్నారు. శ్రీరాముడి జన్మస్థలంలో ఆలయం పూర్తైందని చెప్పుకునే క్షణం ఇది. పవిత్రమైన మంగళవారం రోజున ధ్వజారోహణం జరగనుంది. ప్రధానమంత్రి మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ జెండాను ఎగరవేయనున్నారు. బలమైన ముహూర్త సమయం కోసం వెతికి నవంబర్ 25న నిర్ధరించాం. ఈరోజున వివాహ పంచమి వస్తుంది. మన మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడు, సీతామాత వివాహం ఈ రోజునే జరిగింది. అని శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ప్రధాని మోదీ సహ పలువురు ప్రముఖులు హాజరుకానున్న ఈ వేడుకకు అధికార యంత్రాంగం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసింది.

# నూతన బస్సు సర్వీస్ ప్రారంభం..



**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామం మాదిరే గోలిగూడెం నుండి ఉప్పల్ రింగ్ రోడ్డు వరకు నూతన బస్సు సేవ ప్రారంభమైంది. గోలిగూడెం ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ సేవను మంజూరు చేయించారు.

**బస్సు వేళలు**

మొదట ఉప్పల్ ఎక్స్ రోడ్ నుండి ఉదయం 5:30 కు బయలుదేరి భువనగిరికి ఆరు 15 నిమిషాలకు చేరుకుని గోలిగూడెంకు 7:40కి చేరుతుంది. రెండవ ట్రిప్పులో 9:45 కు బయలుదేరి 11 గంటలకు భువనగిరి చేరుకుని 12 గంటలకు గోలిగూడెం. వస్తుంది. మూడవ ట్రిప్ లో మధ్యాహ్నం 2:20కి బయలుదేరి 3:15కి భువనగిరి చేరుకుని నాలుగు 20 కి గోలిగూడం వరకు వస్తుంది. భువనగిరి పులిగిల్ల గోలిగూడెం మధ్య సరైన ప్రభుత్వ రవాణా లేకపోవడం వల్ల గతంలో ప్రజలు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలపై ఆధారపవలసి వచ్చేదన్నారు. ఈ బస్సు సదుపాయాన్ని గ్రామస్థులు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాసర్ల నరసింహా రెడ్డి, కొంతం ఎల్లారెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు కంచి రాములు, కొంతం నర్సిరెడ్డి, కొంతం బుచ్చిరెడ్డి, కొంతం ప్రభాకర్ రెడ్డి, కొంతం మధుసుధన్ రెడ్డి, మన్నెం జోగి రెడ్డి, కొలన్ యాదిరెడ్డి, కొంతం రమణారెడ్డి, తుమ్మల నరసింహారెడ్డి, పర్వతం రాజు, నారి కొమురయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**వలిగొండ, మహా:** వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పోలేపల్లి వీరస్వామి ఆధ్వర్యంలో మొగిలిపాక చిన్న ఎల్ల స్వామికి 44 వేల రూపాయల చెక్కును అందించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెరుకు శివయ్య మాజీ సర్పంచ్ మొగిలి పాక నరసింహ మాజీ సర్పంచ్ స్వామి ఈతప రాములు పెద్ద ఎల్ల స్వామి బాలకృష్ణ అశోకు శంకరయ్య మల్లేశం గంగయ్య సత్యనారాయణ బాల్ నరసింహ రమేష్ జమ్మయ్య లక్ష్మయ్య ఐలయ్య స్వామి ఉప్పలయ్య లక్ష్మీనారాయణ జంగారెడ్డి మల్లేశం నరసింహకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భీమారం మండలంలో బీసీలకు సర్పంచ్ అవకాశం ఇవ్వాలి

**భీమారం ఎంపీడీవో కార్యాలయం ముందు బీసీ జేఏసీ నాయకుల ధర్నా**



**భీమారం / మంచిర్యాల, మహా :** భీమారం మండలంలో బీసీలకు సర్పంచ్ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ నాయకులు భీమారం ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకపక్క రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్ కల్పిస్తామని తీర్మానం చేసిన ఇక్కడ ఆచరణకు నోసుకోలేదని దుయ్యబట్టారు. భీమారం మండలంలో ఉన్న 11 పంచాయతీలలో ఒక్కటిని కూడా బీసీకి రిజర్వేషన్ చేయకపోవడం విచారకరమని అన్నారు. ఏ సర్వే ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేశారో అధికారులు వెల్లడించాలని వారన్నారు. తక్షణమే రిజర్వేషన్ ప్రక్రియను పునస్ సమీక్షించి బీసీలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి, మహా :** భువనగిరి జిల్లా కేంద్రంలో సోమవారం శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఇందిరమ్మ ఇండ్లు ఉచిత బస్సు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు కాకుండా ఇందిరమ్మ పేరుతో మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు అలాగే మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని అన్నారు

**వలిగొండలో మహిళలకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి**

వలిగొండ మండల కేంద్రంలో సోమవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలని అన్నారు తెలంగాణలో 18 సంవత్సరాల నిండిన ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బీమా నాయక్ వలిగొండ తహసిల్దార్ దశరథ ఎంపీడీవో జలంధర్ రెడ్డి ప్రజా ప్రతినిధులుతదితరులు పాల్గొన్నారు



## ఒకే ఒక్కసారి ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికుల డిమాండ్లు అమలు చేసి చూపుతాం

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**యాదగిరిగుట్ట, మహా:** పెద్ద కందుకూరు ప్రిమియర్ ఎక్సప్లోజీవ్స్ కంపెనీలో తెలంగాణ రాజ్యాధికార కార్మిక విభాగంను ఒకే ఒక్క సారీ ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికుల డిమాండ్లను అమలు చేసి చూపుతామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూర్ లో నేడు ప్రిమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ కార్మికులు నూతనంగా తెలంగాణ రాజ్యాధికార కార్మిక విభాగం ఏర్పాటు సందర్భంగా కార్మిక విభాగం జెండాను కార్మికులతో కలిసి మల్లన్న ఆవిష్కరించారు... ముందుగా పెద్ద కందుకూర్ గ్రామం నుండి బైక్ ర్యాలీ నిర్వహించి కంపెనీ గేటు వద్ద నిర్మించిన గద్దెవద్ద అంబేద్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించి, TRKV జెండా ఆవిష్కరించారు... అనంతరం జరిగిన సభలో తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాబోయేది బిసిల రాజ్యమని బిసిల చైతన్యం చూసి అగ్రకులాలు భయపడుతున్నాయని అన్నారు తెలంగాణ రాజ్యాధికార కార్మిక విభాగంలో అగ్రకులాలకు చోటు లేదని దయచేసి మా కార్మిక సంఘంలోకి రావద్దని విజ్ఞప్తి చేశారు... ఈ సందర్భంగా మల్లన్న కార్మికులకు కోడి కథ చెప్పి కార్మికులను ఆలోచింపజేశారు సభ అనంతరం తీన్మార్ మల్లన్నను కార్మికులు గజమాలతో సన్మానించారు.

# పంచాయతీ ఎన్నికలకు సిద్ధం

- ఎన్నికల సంఘానికి ప్రభుత్వం లేఖ
- నేడు హైకోర్టు విచారణ తర్వాత నోటిఫికేషన్!
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం

**హైదరాబాద్, మహా:** పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి వివరాలు సమర్పించి, ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్ఈసీకి పంపింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గత రెండు రోజులుగా దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లతోపాటు, లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లను కూడా పూర్తి చేసింది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరగాల్సింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉన్నందువల్ల విచారణ జరగలేదు. మంగళవారం విచారణ తర్వాత నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 12,733 పంచాయతీల్లోని 1,12,288 వార్డుల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది.

**నేడు కేబినెట్ సమావేశం..**

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు కేబినెట్ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల సర్పంచ్ ఎన్నికలు, బీసీలకు 42% కోటా విషయంలో చట్టపరమైన సవాళ్లు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి వంటి కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కేబినెట్ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములాఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ఆ అంశంపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

## భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవనం నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. అనంతరం కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు పచ్చి బూటకం

**అడవిలో ఆదివాసీలను గత 23 నెలలుగా హింసిస్తున్నారు.. మంచిర్యాల ఐబి చౌరస్తాలో ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ధర్నా**

**మంచిర్యాల, మహా :** ఈ మధ్య జరిగిన మావోయిస్టుల ఎన్కౌంటర్లు పచ్చి బూటకమని ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు ఉమ్మడి వేదిక రాష్ట్ర నాయకులు ఏం రాయమల్లు, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి అంజన్న, టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు జైపాల్ సింగ్, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజయ్య, సమ్మ రాజయ్య, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర నాయకురాలు మంగ, తెలంగాణ మున్సిపల్ సంఘం గౌరవ అధ్యక్షులు దేవి సత్యం, ఎస్ జి ఎల్ బి కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు జి రాములు, ఆర్ సి ఎస్ నాయకులు ఆర్ రాజ్ కుమార్, పి డి ఎస్ యు విజృంభన రాష్ట్ర అధ్యక్షులు. బాబురావు కే మహేష్ పి ఓ డబ్ల్యు స్త్రీ విముక్తి. నాయకురాలు. రాజేశ్వరి, రమా, ఆర్ సి ఎఫ్ రాష్ట్ర నాయకులు జనగాం చిన్నయ్యలు ఆరోపించారు. సోమవారం మంచిర్యాల ఐబి చౌరస్తాలో ప్రజా సంఘాల ఉమ్మడి ఐక్యవేదిక ఆధ్వర్యంలో భాజపా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఎన్కౌంటర్ల పేరిట చేస్తున్న హత్యాకాండను నిరసిస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటి సభ్యుడు ఆదివాసీ నాయకుడు మడివి హిడ్మా ఇతర మావోయిస్టు నాయకులను నవంబర్ 18న మారెడ్ మిల్లిలో బూటకపు ఎన్ కౌంటర్ లో చంపివేయడాన్ని నిరసిస్తూ హిడ్మా కుటుంబ సభ్యులు, ఆదివాసీ పౌర, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నామని అన్నారు.




## నేడు15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**వలిగొండ, మహా:** వలిగొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని వలిగొండ ఎంపీడీవో జలంధర్ రెడ్డి విలేకరులకు తెలిపారు సామాజిక తనిఖీ వివరాలను గ్రామాల వారిగా ప్రజావేదికలో చదివి వినిపించడం జరుగుతుందన్నారు

EDITORIAL సంపాదకీయం

# తెలంగాణ ఆలయాలకు స్వర్ణ యుగం..!

తెలంగాణ రాష్ట్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటోంది. రాష్ట్రంలోని పురాతన, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను కేవలం ప్రార్థనా మందిరాలుగానే కాకుండా, పర్యాటకులను విశేషంగా ఆకర్షించే అద్భుత పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. దేవాదాయ శాఖ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పుడు కార్యరూపం దాలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల దశలవారీ అభివృద్ధికి ఏకంగా రూ.400 కోట్లను వెచ్చించేందుకు సిద్ధమైంది. చెరువుగట్టు, కొండగట్టు, భద్రాచలం నుండి వేములవాడ వరకు ప్రతి ఆలయానికి నిధుల వరద పారించి, భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.



**ఖమ్మం జిల్లా ఆలయాలకు స్వర్ణయుగం..**
**భద్రాద్రికి భారీ నిధులు**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆధ్యాత్మిక వైభవానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ముఖ్యంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోతున్నాయి. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులకు ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏకంగా రూ.60.20 కోట్లను మంజూరు చేయడం సంచలనం రేపుతోంది. ఈ నిధులతో ఆలయ పరిసరాల్లోని భూములను సేకరించి, రామయ్య సన్నిధిని అత్యద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. ఇక ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని ఆధ్యాత్మిక కేంద్రమైన స్థానాల లక్ష్మీపురానికి కూడా ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక్కడ కొలువైన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి రూ.3.20 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో భక్తుల సౌకర్యార్థం కల్యాణ వేదిక, అభిషేక మండపం, వసతి గృహాల నిర్మాణాలను చేపట్టనున్నారు. దీంతో జిల్లాలో టెంపుల్ టూరిజం ఊపందుకుని, భక్తుల తాకిడి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

**రాష్ట్రవ్యాప్తంగా రూ.400 కోట్లతో మాస్టర్ ప్లాన్**

ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలోని ఇతర పుణ్యక్షేత్రాలను కూడా అభివృద్ధి చేసేందుకు దేవాదాయ శాఖ రూ.400 కోట్లతో భారీ స్కెచ్ వేసింది. ఇందులో ప్రధాన ఆకర్షణగా యాదగిరిగుట్ట నిలవనుంది. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి 60 కిలోల బంగారు తాపడం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. దేవస్థానం వద్ద ఉన్న 25 కిలోల బంగారానికి, భక్తులు విరాళంగా ఇచ్చిన 35 కిలోల బంగారాన్ని జతచేసి ఈ మహత్తర క్రతువును నిర్వహిస్తున్నారు. కేవలం ఈ బంగారు పనుల కూలీ, తయారీ కోసమే ప్రభుత్వం రూ.8 కోట్లు భరిస్తోంది. రానున్న బ్రహ్మోత్సవాల నాటికి యాదాద్రి స్వర్ణకాంతులతో మెరిసిపోనుంది. అంతేకాకుండా అక్కడ వేదపాఠశాల నిర్మాణం, 101 ఎకరాల భూసేకరణ, డార్మెటరీ హాల్ ఏర్పాటుతో యాదాద్రి రూపురేఖలే మారిపోనున్నాయి.

**వేములవాడ, ఓరుగల్లు,**
**పాలమూరు ఆలయాలకూ మోక్షం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రూ.76 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో అన్నదాన సత్రానికే రూ.35.25 కోట్లు కేటాయించడం విశేషం. అలాగే బద్ది పోచమ్మ ఆలయం, గుడి చెరువు సుందరీకరణ పనులు కూడా ఊపందుకున్నాయి. ఇక చారిత్రక ఓరుగల్లులోని భద్రకాళి అమ్మవారి ఆలయ మాడవీధుల నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రముఖ కురుమూర్తి జాతర కోసం రూ.110 కోట్లతో కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మిస్తున్నారు. కామారెడ్డి జిల్లా సలాబత్‌పూర్ మారుతీ మందిరానికి రూ.6.70 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి రూ.12.15 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా ఈ నిధుల వరదతో తెలంగాణలోని ఆలయాలన్నీ భక్తులకు మెరుగైన సౌకర్యాలతో కొత్త కళను సంతరించుకోనున్నాయి.

- గడల నరసింహారావు, ఖమ్మం బ్యూరో

# అయోధ్య రామమందిర నిర్మాణం సంపూర్ణం

## మరో అద్భుత ఘట్టం నేడు ఆవిష్కారం

మహా ప్రత్యేకం: అయోధ్యలో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. రామాలయం ధ్వజారోహణం – యుగయుగాల నిరీక్షణకు తెరపడే మహోత్సవం.. దశాబ్దాలుగా వేచి చూస్తున్న రామాలయం ధ్వజారోహణం మంగళవారం జరగనుంది. అయోధ్య ధరణి మళ్లీ పుణ్యస్పందనతో నిండిపోయే సమయం చేరుకుంది. దశాబ్దాలుగా కోట్లాది హిందువుల మనసుల్లో నిండిన ఆరాటం, అనేక తరాల కలతో ముడిపడిన రామాలయం కల సాకారమై ముందుకు సాగుతున్న వేళ... మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. ధ్వజారోహణం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, ఆలయం పూర్తైందని ప్రపంచానికి చాటి చెప్పే కార్యక్రమమని శ్రీ రామ జన్మ భూమి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఇప్పుడు రాముడితో పాటు హనుమాన్, సీత సహా ఆయన కుటుంబం సైతం మొదటి అంతస్థులో ప్రతిష్ఠాపన జరగనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అతిథుల్లో వీఐపీలు మాత్రమే ఉండరని, వివిధ వర్గాలకు చెందిన భక్తులు ఉంటారని చెప్పారు. ఇప్పటి వరకు ఆహ్వానించని వారిని ముఖ్యంగా రాముడికి సాయం అందించిన వర్గాలకు సంబంధించిన వారిని పిలుస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 డిసెంబర్ నాటికి ఆలయం మినహా మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు.

### కాషాయ ధ్వజాన్ని ఎగరేయనున్న ప్రధాని మోదీ

అయోధ్య రామ్‌లల్లా ఆలయ 191 అడుగుల శిఖరంపైన ప్రతిష్ఠించిన కాషాయ ధ్వజాన్ని ప్రధాని మోదీ ఎగరవేయనున్నారు. ఈ వేడుకకు సంబంధించిన సన్నాహాలు పూర్తయ్యాయి. రామ్‌లల్లా ఆలయంపై ఎగరనున్న కాషాయ ధ్వజం త్రిభుజాకారంలో ఉండనుంది. ఈ జెండాపై రాముడి తేజస్సు, శౌర్యం సూచించేలా సూర్యుడు, కోవిదర చెట్టు, ఓం చిహ్నాలు ఉండనున్నాయని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. గౌరవం, ఐక్యతను కాషాయ రంగు ప్రతిబింబించనున్నట్టు వెల్లడించింది. ఈ వేడుక కోసం సుమారు 100 టన్నుల రకరకాల పూలతో ఆలయాన్ని, నగరంలోని మార్గాలను అలంకరించారు. దాదాపు 7 వేల మంది ప్రత్యేక అతిథులు ఈ అపూర్వ ఘట్టానికి హాజరవుతారని రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. ఇప్పటికే పలువురు ప్రముఖులు అక్కడికి చేరుకోగా భక్తులు భారీగా తరలివెళ్తున్నారు.

### భారత దేశ హృదయంలో భక్తి పతాకం

రాముడి పేరు వినగానే భక్తి, భరోసా, ధర్మం, నీతి, న్యాయం... ఇవన్నీ అంతర్లీనమై ప్రతిధ్వనిస్తాయి. అయోధ్యలో జరుగుతున్న ప్రతి అడుగు... భారతీయ సంస్కృతికి, ఆధ్యాత్మిక సంస్కృతికి శాశ్వత గుర్తుగా నిలుస్తోంది. ధ్వజారోహణం వేడుకతో రామాలయం మరో కొత్త దశలోకి అడుగుపెడుతోంది. అది కేవలం అయోధ్య పండుగ మాత్రమే కాదు... భారత దేశ హృదయంలో భక్తి పతాకం ఎగురవేసే చారిత్రక క్షణం. వేడుక సందర్భంగా... రామనామం మారుమోగే క్షణాల్లో ఆకాశమే అంబరమై నిలబడుతుంది. భక్తుల మనసుల్లో ఒకే మాట...జై శ్రీరామ్!



**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

# ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృషి

## బాసర నుంచి కీసర వరకు ఆలయాల పునరుద్ధరణ.. దేవాదాయ ధర్మాదాయ, పర్యావరణ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



**వరంగల్ మహా;** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బాసర నుండి కీసర వరకు దేవాలయాల ను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇటీవల కాలంలో రాష్ట్ర దేవాలయాల్లో ఆదాయం ఘననీయంగా పెరిగిందని భక్తులకు ఇబ్బందులు కాకుండా చేయడమే ప్రభుత్వ బాధ్యత అని కొండాసురేఖ అన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో అన్ని దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని గత 2023 సంవత్సరం చివరి అంకంలో రాష్ట్రంలోని ఉన్న 699 దేవాలయాల నుంచి రూ 373.55 కోట్లు ఆదాయం వస్తే ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపట్టిన కార్యక్రమాల ద్వారా రూ. 2024లో 544.61 కోట్లు వచ్చినట్లు దేవాదాయ శాఖ గణాంకాలే చెబుతు న్నాయన్నారు. ప్రభుత్వం భక్తులకు వసతులు కల్పించడం ద్వారా భక్తుల సంఖ్య పెరిగిందని ప్రధాన దేవాలయాలు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయని ఆమె తెలిపారు. వీటితో పాటు రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధిపై ఎండోమెంటు శాఖ మంత్రి కొండా సురేఖ నేతృత్వంలోని దేవాదాయ శాఖ పెట్టింది. అందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపొందించి వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా... రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల్లో సుమారు రూ.450 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెడీ అయింది. ముఖ్యంగా చెరువుగట్టు, కొండగట్టు, భద్రాచలం, వేములవాడ ఆలయాలకు భారీగా నిధులు కేటాయించింది. యాదగిరి గుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ విమాన గోపురానికి 60 కిలోల బంగారు తాపడం పనులు జరుగుతున్నాయని ఇందులో దేవస్థానం వద్ద నిల్వ ఉన్న 25 కిలోల బంగారం తో పాటు విరాళంగా వచ్చిన 35 కిలోల బంగారాన్ని వినియోగిస్తున్నారు. గోల్డ్ ప్లేటింగ్ తయారీ, ఫిక్సింగ్ చార్జీలకు కలిపి మొత్తం రూ. 8 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నదని రానున్న బ్రహ్మోత్సవాల నాటికి ఈ పనులు పూర్తి కానున్నాయని తెలిపారు. ఇంకా 17 ఎకరాల్లో రూ.43.79 కోట్లతో వేద పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతోపాటు వసతి గృహాన్ని ఏర్పాటు చేయడానికి 101ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భక్తుల వసతి కోసం కొండ పై డార్మెటరీ హాల్ ఏర్పాటు చేయడం జరిగిందని వైటీడీఏకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించడంతోపాటు పరిపాలనలో పారదర్శకతకు పట్టం కట్టారు. ముఖ్యంగా వేములవాడ లోని రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.76 కోట్లు మంజూరు చేసిందని ఇందులో అన్నప్రసాద సెంటర్ నిర్మాణానికి రూ.35.25 కోట్లు కేటాయించగా శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధి, గుడి చెరువు సుందరీకరణకు మరో రూ.20 కోట్లు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందని మంత్రి తెలిపారు.

**శరవేగంగా ఆలయాల అభివృద్ధి**

భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ అభివృద్ధిలో భాగంగా భూ సేకరణకు ప్రభుత్వం రూ.60.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. వరంగల్ లోని శ్రీ భద్రకాళి అమ్మవారి దేవాలయ మాడవీధుల నిర్మాణానికి రూ.30 కోట్లు కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) నిధుల నుండి కేటాయించింది. మాడవీధుల పనులు పురోగతిలో ఉన్నాయి. దీంతోపాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, దేవాలయ అభివృద్ధికి రూ.12.15 కోట్లు మంజూరు చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రముఖ కురుమూరి జాతరకు సంబంధించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగానే రూ.110 కోట్లతో కొండపైకి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఖమ్మం జిల్లాలోని వైరా స్థానాల లక్ష్మీపురం లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ వేదిక, అభిషేక మండపం, వసతి గృహాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.20 కోట్లు మంజూరు చేసింది. కామారెడ్డి జిల్లాలోని సలాబత్‌పూర్ శ్రీ మారుతీ మందిర్‌కు సంబంధించి రూ.6.70 కోట్లతో కల్యాణమండపం, ప్రకారమండపం, తో పాటు ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు.

# ప్రజావాణికి 159 అర్జీలు

## అర్జీలను సత్వరమే పరిష్కరించండి.. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హన్మకొండ మహా;** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి లకు అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో గృహ నిర్మాణ, మున్సిపల్, రెవెన్యూ, డి ఆర్ డి ఓ, వ్యవసాయ, ఉపాధి కల్పన, ఇతర శాఖలకు సంబంధించి స్వీకరించిన 159 సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ,పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన లా కాలేజీ విద్యార్థినిలు

## సరైన సదుపాయాలు కల్పించాలంటూ ధర్నా



**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కాజీపేటలోని మహిళా "లా కాలేజీ"లో సరిపడిన సదుపాయాలు లేవని, మేము ఉండడానికి అనేక ఇబ్బందులు ఉన్న ఈ కాలేజీలో డిగ్రీ విద్యార్థులను కూడా చేర్చడం జరిగిందని లా.. స్టూడెంట్స్ కాలేజీ మహిళా విద్యార్థులు కాలేజీ ఎదుట ఉన్న రోడ్డు పై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాలేజీలో లైబ్రరీ లేదని, వాష్ రూమ్ లు కూడా లేవని క్లీన్ స్థాయిలో వసతులు లేవని దీనికి తోడు డిగ్రీ విద్యార్థులను కూడా ఇందులో చేర్చడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతి బాపూలే స్కూల్ లో లా కళాశాలలో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో ఇప్పుడు డిగ్రీ విద్యార్థులు ఉండటానికి కూడా అనుమతి ఇవ్వడంతో సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు లా స్టూడెంట్స్ తెలిపారు.



# కారులో జర్నలిస్ట్ సజీవదహనం

**హన్మకొండ మహా ;** హైదరాబాద్ శివారు షామీర్ పేట సమీపంలోని బాహ్య వలయ రహదారి పై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదంలో యువ జర్నలిస్ట్ తాళ్లపల్లి దుర్గాప్రసాద్ (31) కారులోనే సజీవదహన మయ్యాడు. హన్మకొండ జిల్లా భీమారం వినాయకుడి గుడి సమీపంలో నివాసముంటున్న దుర్గాప్రసాద్ ఈ 69 ఛానల్ రాష్ట్ర బ్యూరో గా పని చేస్తున్నాడు. పని నిమిత్తం హైదరాబాద్ వెళ్ళిన దుర్గా ప్రసాద్, అక్కడ తన అల్లుడి ఇంటి వద్ద కారు ఉంచి రైలులో విజయవాడ వెళ్లాడు. తిరిగి వచ్చి రాత్రి అక్కడే బస చేసి, ఉదయం స్వగ్రామానికి బయలుదేరాడు. ఉదయం 5:25 నుంచి 5:30 గంటల మధ్యలో షామీర్‌పేట వద్దకు రాగానే నడుపుతున్న ఎకోస్పోర్ట్ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల తీవ్రతకు వాహనం లాక్ కావడంతో బయటకు రాలేక లోపలే చిక్కుకుపోయి కారులోనే అగ్నికి ఆహుతాయ్యాడు.మృతుడి స్వగ్రామం హాసనపర్తి మండలం జగిరి కాగా, తండ్రి ప్రభాకర్ ఆర్టీసీలో తనిఖీ వాహన చోదకుడిగా పనిచేసి విరమణ పొందారు. సోదరుడు సురేష్ వివాహం అనంతరం ఉద్యోగ రీత్యా యూకేలో స్థిరపడ్డాడు. చేతికి అంది వచ్చిన కొడుకు అకాల మరణంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళల ఆర్థిక ఎదుగదలే ప్రభుత్వ లక్ష్యం

## ఆదిలాబాద్ పర్యటనలో మంత్రి జూపల్లి వెల్లడి



**ఆదిలాబాద్ మహా** : మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆదిలాబాద్ ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మహిళలు గృహాల్లో మాత్రమే కాకుండా, సమాజ నిర్మాణంలో ,రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి గుర్తుచేశారు. మహిళలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలు ఇప్పటికే లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని మంత్రి వెల్లడించారు. మహిళల ఆదాయ వనరులను పెంపొందించేందుకు, ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ పంపుల యజమానులుగా చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందువల్ల కుటుంబ ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని అన్నారు. అలాగే రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ. 22 వేల కోట్లు కేటాయించామని, ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని పొదుపు సంస్కృతి పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు మహిళా సంఘాలకు రూ. 21.83 కోట్ల ఎస్ హెచ్ జీ రుణాల చెక్కులను మంత్రి అందజేశారు.అంతకు ముందు ఆదిలాబాద్ రూరల్ మండలం అనుకుంట గ్రామంలో లబ్ధిదారులు బాస గంగమ్మ రమేష్ దంపతుల ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. లబ్ధిదారులను మంత్రి పట్టు వస్త్రాలతో సత్కరించారు. పేద కుటుంబాల సొంతింటి కల నిజం చేయడం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇండ్లు నిర్మించి అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇందిరా గాంధీ కాలం నుంచే పేదల గృహ హక్కుల కోసం ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఇంకా ఇండ్లు నిర్మించని అర్హులకు బ్యాంకులు, శ్రీనిధి, మహిళా సంఘాల ద్వారా సులభ రుణాలు అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు.



# పదవి విరమణ ప్రతి ఒక్కరికి అనివార్యం

## మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ

**మందమర్రి, మహా :** పదవి విరమణ ప్రతి ఒక్కరికి అనివార్యమని సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ వెల్లడించారు. సోమవారం మందమర్రి జిఎం ఛాంబర్ లో జి.ఎం చీఫ్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ ఈనెల పదవీ విరమణ పొందుతున్న దృశ్య అతనికి శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సుదీర్ఘ కాలం వివిధ సేవలు అందించారని అన్నారు. ఉద్యోగాలు నిర్వహించిన ప్రతి ఒక్కరు ఉద్యోగ విరమణ చేయడం పరిపాటేనని అన్నారు. ఈ సందర్భంగా తన సేవలను కొనియాడారు. ఎస్.ఓ.టు జి.ఎం లలితేంద్ర ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ రవి, డివైపిఎం ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సందీప్, కార్తీక్, సత్యనారాయణ, బొంగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా నుంచి రోడ్లు, ప్రభుత్వ స్థలాలను కాపాడండి

## గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన కాలనీ ప్రజలు



**వరంగల్ మహా;** వరంగల్ నగరం 19వ డివిజన్ కాశీబుగ్గ లోని ఇండోర్ స్టేడియం ముందు నుండి వీకర్స్ సెక్షన్ కాలనీకి వెళ్ళే దారిని ఇటీవల కొందరు కబ్జాదారులు ఏకంగా రోడ్డునే కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించగా స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ఈ రోడ్డు స్థలాన్ని 2010 సంవత్సరంలో రహస్యంగా సొసైటీ కమిటీ తో కుమ్మక్కై స్థానిక కార్పొరేటర్ భర్త ఏకంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు అదే స్థలాన్ని వారు దర్జాగా వేరే వాళ్ళకు అమ్ముకొగా అక్కడ నిర్మాణం చేయాలని ప్రయత్నిస్తుండగా అడ్డుకున్న కాలని వాసులు ఈ కబ్జా పై బల్దియా లో సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసామని ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకు వెళ్తామని కాలనీ వాసులు తెలిపారు. ముఖ్యంగా 15 ఏళ్లుగా కాలనీకి రోడ్డు మార్గం ఉందని ఇప్పుడు దీన్ని సొసైటీ కమిటీ, కార్పొరేటర్ భర్త కుమ్మక్కై ప్రధాన 80ఫీట్ల రోడ్డు మార్గం లేకుండా చేసి అక్రమ నిర్మాణానికి తెర లేపారని, రోడ్డు కు సంబంధించిన 100 గజాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ఇప్పుడు వేరే వాళ్లకు దాదాపు 50 లక్షలకు అమ్మినట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ట్రై సిటీ లోని ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలు, చివరికి రోడ్లను, నాళాలను కబ్జాలు చేయకుండా కబ్జా కాకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత సంబంధిత అధికారుల పై ఉందని ముఖ్యంగా ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఈ అంశం రెవెన్యూ అధికారులకు సంబంధించిందని బల్దియా అధికారులు, ఇది కార్పొరేషన్ పరిధిలో ఉందని రెవెన్యూ అధికారులు సంబంధిత ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారాన్ని ఇచ్చుకుంటూ కాలం వెళ్లదీసిన కారణంగానే గ్రేటర్ వరంగల్ నగరంలోని అనేక ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురయ్యాయని నగర ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొనకపోతే నగరంలో ఉన్న ప్రభుత్వ భూములు, స్థలాలు ఏమాత్రం మిగలవని నగర ప్రజలు హెచ్చరిస్తున్నారు.



# సెంట్రల్ జోన్ డీసీపీని కలిసిన మట్టెవాడ పోలీసులు

**వరంగల్ మహా;** వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని మట్వాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు తో పాటు ఎస్సైలు సాంబయ్య, సబ్బాని శివ కుమార్, ఇతర ఎస్సైలు సెంట్రల్ జోన్ నూతన డీసీపీ గా బాధ్యతలు చేపట్టిన దారా కవిత ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# పత్తి కొనుగోళ్లు ప్రారంభం



**జైనూర్ మహా :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని పులాజి బాబా జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథ్ అధికారులతో కలిసి కొనుగోళ్ల ను ప్రారంభించారు .ఈసందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులు పత్తిని జిన్నింగ్ మిల్లులో అమ్మాలని అన్నారు. బయట దళారులకు అమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు జిన్నింగ్ మిల్ లో క్వింటాలు కు 8వేల 110 రూపాయల మద్దతు ధర ఉంటుందని తెలిపారు. తేమ 8శాతం ఉండాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో సిపిఓ ఆర్. నరేష్ , సుబుర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముఖిద్ ,ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్. కూడప ప్రకాష్, కనక గంగారాం సీనియర్ నాయకుడు అంబాజీ తదితరులు పాల్గొన్నారు

# పురాతన ఆలయాలకు మహర్దశ

## ఆలయాన్ని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఆర్కియాలజీ డైరెక్టర్



**వరంగల్ మహా ;** పురాతన ఏకవీర ఎల్లమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడం తో పాటు ఇందుకు అవసరమైన నిధుల మంజూరు కొరకు కృషి చేస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15 వ డివిజన్ పరిధి మొగిలిచర్ల లో ప్రాచీన ప్రసిద్ధి చెందిన ఏకవీర ఎల్లమ్మ దేవాలయంను ఎంపీ కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్‌రెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, తో కలిసి రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు క్షేత్ర స్థాయి లో ఆలయ నిర్మాణ వైశిష్ట్యం, పురాతన శైలి, శిల్పకళ వంటి అంశాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆలయ పునరుద్ధరణకు అవసరమైన చర్యలను తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఏంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మంజూరు చేయిస్తామన్నారు. రానున్న 100 సంవత్సరాలు దృష్టిలో ఉంచుకొని అందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ ను రూపొందించుకొని ఆలయానికి అనుబంధంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని అదనంగా తీసుకొని అందులో గార్డెనింగ్ ల్యాండ్ స్కేపింగ్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ పురాతన ఆలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని గతం లో సుమారు 30 విగ్రహాలను ఆలయ ఆవరణ లో ఏర్పాటు చేయడం జరిగిందని, వాటికి పీఠాలు ఏర్పాటు చేసి అమర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు మాట్లాడుతూ ఆలయ ప్రాచీనతను కాపాడేలా చర్యలు చేపడతామని తెలిపారు. పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎంపీ ఎమ్మెల్యే కలెక్టర్ అక్కడ ఉన్న రాతిని తొలిచి నిర్మించిన గుహలతో పాటు ఇటీవల గ్రామం నుండి సేకరించిన శిల్పాలు శాసనాలు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని కలియ తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమం లో కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, డి ఆర్ ఓ విజయలక్ష్మి జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, టార్చ్ అరవింద్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు



# దివ్యాంగుల భవనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా పట్టణంలోని కైలాష్‌నగర్‌లో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన దివ్యాంగుల సంఘ భవనాన్ని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ , జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం ప్రారంభించారు. మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భవనాన్ని పరిశీలించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అన్నారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని చర్యలు చేపట్టి దివ్యాంగులకు విద్య, ఉపాధి, స్వయం సమర్థతలో అవకాశాలు పెంపొందిస్తామని భరోసా ఇచ్చారు. కొత్తగా నిర్మించిన సంఘ భవనం దివ్యాంగుల సేవా కార్యక్రమాలు, సమావేశాలు, శిక్షణలకు వినియోగపడుతుందన్నారు.ఈ సందర్భంగా స్థానిక దివ్యాంగుల సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ భవనం నిర్మాణం చేపట్టిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ

## ..బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి,మహా:** ఏందిరా మహిళా శక్తి చీరలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తాండూరు మండల కేంద్రంలోని మహిళలకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేయడం జరిగింది.తాండూర్ మండల కేంద్రంలోనీ ఎంపీడీవో కార్యాలయంలో మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై తాండూర్ మండలానికి చెందిన మహిళకు చీరలను బెల్లంపల్లిఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే గడ్డం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని వివరించారు.ఆర్థిక సాధికారతలోను అభివృద్ధిలో మహిళలు ముందు వరుసలో ఉండాలని ఆకాంక్షించారు మహిళలు కుటుంబానికి పునాది లాంటివారని, మహిళలు ఆర్థికంగా ఆరోగ్యంగ పరంగా బలంగా ఉండాలని,మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందనీ ప్రకటించారు అన్నిరంగాలలో మహిళలు భాగస్వాములు కావాలనీ,రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుందని శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి పునరుద్ఘాటించారు. నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని,పేద ప్రజల సొంతింటి కల ప్రజాపాలనలో సీఎం తోనే సాధ్యమైందని తాండూర్ మండలంలోనే మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు.బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలకేంద్రంలోని మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికాగా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరయ్యారు. నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది.నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల కుటుంబీకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు అందజేశారు.




# నూతన ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఈ శ్రీనివాస్

**వరంగల్, మహా ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి లోని మామునూర్ పోలీస్ స్టేషన్ కు నూతన సీఐ గా ఇన్స్పెక్టర్ ఈ. శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్ కు చెందిన శ్రీనివాస్ గతంలో జనగామ, రఘునాథ్ పల్లి పోలీస్ స్టేషన్లలో ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వర్తించారు.



# సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా బాధ్యతలు చేపట్టిన దారా కవిత

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా దార కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ పరిధిలోని అధికారులు సిబ్బంది నూతన డీసీపీని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. డీసీపీ కవిత హైదరాబాద్ సైబర్ విభాగం పని చేస్తూ బదిలీపై సెంట్రల్ జోన్ డీసీపీగా నియమించబడ్డారు.

# గుర్తు తెలియని మగ శవం



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని భద్రకాళి ఆలయానికి వెళ్ళే దారిలో పాలిటెక్నిక్ కళాశాల ఫుట్ పాత్ పై ఒక గుర్తు తెలియని మగ శవం ఉన్నది. ఆయన వయసు అందాజ 55 నుండి 60 సంవత్సరాల మధ్య ఉండవచ్చునని అలాగే ఎత్తు సుమారు 5.2 చామన చాయ రంగు కలిగి ఉన్నాడని పోలీసులు తెలిపిన సమాచారం. ఈ వృద్ధుడు గత రెండు సంవత్సరాల నుండి భద్రకాళి టెంపుల్ చుట్టుపక్కల అడుక్కొని తింటూ పాలిటెక్నిక్ కాలేజ్ ఫుడ్ పాత్ పై పడుకొనే వాడిని స్థానికులు చెబుతున్నారు. అతను తేదీ 23.11.2025 ఉదయం 8.00 గంటలకు చుట్టుపక్కల వారు చూసేసరికి చనిపోయి ఉండగా వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు గుర్తుతెలియని మగ శవాన్ని ఎంజీఎం మార్చురీ రూమ్ లో భద్రపరచడం జరిగిందని ఎవరైనా అతనినీ గుర్తుపట్టిన వారు మట్టేవాడ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ 8712685117, లేదా ఎస్సై ఎస్ శివ 8712584599 నెంబర్ల కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మద్యం షాప్‌కు వ్యతిరేకంగా మహిళల ధర్నా




**సిర్పూర్, మహా:** కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం నజ్రుల్ నగర్ గ్రామంలో ప్రతిపాదిత మద్యం దుకాణాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ మహిళలు రోడ్డెక్కారు. గ్రామంలో కొత్తగా మద్యం షాప్ ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల గ్రామంలోని శాంతి భద్రతలు దెబ్బతింటాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇప్పటికే మద్యం కారణంగా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, యువత మద్యం అలవాటుకు బానిసైపోతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మద్యం దుకాణాన్ని గ్రామం మధ్యలో ఏర్పాటు చేయడం ప్రజలపై మరింత భారం పెడుతుందని వారు మండిపడ్డారు. గ్రామ పెద్దలు, మహిళలు కలిసి ధర్నా చేపట్టి అధికారులు వెంటనే మద్యం దుకాణ అనుమతిని రద్దు చేయాలని, గ్రామంలో ఏ విధమైన మద్యం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. గ్రామ శాంతి, కుటుంబాల శ్రేయస్సు కోసం తాము ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మహిళా స్వయం సహాయక బృందాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పంపిణీ చేశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ముందుగా మహిళా సంఘాలో ఉన్న మహిళలకు మహిళా శక్తి ఇందిరామ్మ చీరలను అందిస్తాము, తర్వాత ప్రతి మహిళకు చీరలను అందిస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా శక్తిమంతులుగా మారడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మున్ని, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం గీతాన్ని ప్రేరణగా తీసుకొని యువత వికసిత్ భారత లక్ష్యంగా ముందుకు సాగాలి

కార్పొరేటర్ తోకల...




**రాజేంద్రనగర్, మహా :** వందేమాతరం గీతాన్ని ప్రేరణగా తీసుకొని వికసిత్ భారత్ లక్ష్యంగా యువతరం ముందుకు నడవాలి. వందేమాతర గీతం వెలువడి 150 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం 150 సంవత్సరాల సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ వీరేందర్ గౌడ్ తో కలిసి రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వందే భారత్ గీతం వెలువడి 150 సంవత్సరం లోకి అడుగుపెట్టిన సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల మాట్లాడుతూ వందే మాతరం గీతం 150 సంవత్సరాల వేడుకలను నవంబర్ 7 నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7 వరకు నిర్వహించుకోవాలి వందే మాతరం గీతాలాపన స్వాతంత్ర్య ఉద్యమంలో అందరిలో ఐక్యమత్యాన్ని పెంచింది. వందే మాతరం గీతాలాపన మనందరిలో స్ఫూర్తిని నింపింది. వికసిత్ భారత్ లక్ష్యంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మనం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బుచ్చి రెడ్డి, సంతోష్ గౌడ్, మురళీధర్ రెడ్డి, బబ్లూ, మధుసూదన్ రెడ్డి, మజార్, ప్రభుదాస్, రామ రావు, శేఖర్, స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలను నట్టేట ముంచిన కాంగ్రెస్

### రిజర్వేషన్లలో గందరగోళం మరింత అన్యాయం

### జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గత శాసనసభ ఎన్నికలలో నమ్మిన పాపానికి బిసిలను కాంగ్రెస్ పార్టీ నిట్టనిలువుగా ముంచిందని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని, ఏటా 20 వేల కోట్ల రూపాయల నిధులు బిసి సబ్ ప్లాన్ కింద ఇస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టులలో 25 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్ లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లు 33 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి , ఆర్డినెన్స్ జారీ చేస్తే కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లి దానిని రద్దు చేయించిందని ఆయన గుర్తు చేశారు. ఆనాడు చెల్లని ఆర్డినెన్స్ ఈరోజు 42 శాతానికి పెంచితే ఎలా చెల్లుతుందని ఆయన ప్రశ్నించారు. చట్టప్రకారం బిసి రిజర్వేషన్ల పెంపు కేంద్రం ఆమోదంతో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో సవరణలు జరిగితేనే సాధ్యమవుతుందని చెప్పారు. అన్నీ తెలిసే కావాలని తప్పుడు హామీలు ఇచ్చి బిసిలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తామని చెబుతూ సిగ్గు విడిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ల మాట దేవుడెరుగు కనీసం 23 శాతం కూడా ఇవ్వలేదని అన్నారు. మంచాల మండలంలో 23 సర్పంచ్ స్థానాలకు గాను కేవలం రెండు స్థానాలు , యాచారం మండలంలో 24 స్థానాలకు గాను కేవలం నాలుగు స్థానాలు మాత్రమే బిసిలకు కేటాయించారని ఆయన వివరించారు. డెడికేటెడ్ కమీషన్ రిపోర్టును ప్రజల ముందు పెట్టకుండా ఇష్టానుసారంగా రిజర్వేషన్లు ప్రకటించి బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన స్థానాలను దక్కకుండా చేశారని ఆయన విమర్శించారు. నియోజకవర్గంలో రిజర్వేషన్లలో గందరగోళం జరుగుతున్నా , బిసిలకు అన్యాయం జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే నోరు మెదపకపోవడం దేనికి సంకేతమని ఆయన ప్రశ్నించారు. అసమగ్ర రిజర్వేషన్ల విధానంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి కనీసం చట్టం ప్రకారం ఆయా వర్గాలకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మాజీ ఎంపిపి కృపేష్, మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో నిర్వహించిన ప్రజావాణికి 40 ఫిర్యాదులు

- ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 40 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి,నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూపరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గండిపేట మండలంలో నూతనంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పోలీస్ స్టేషన్‌ను

## ప్రారంభించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్




**గండిపేట, మహా:** తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కు ఎక్సైజ్ శాఖను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం గండిపేట మండలం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ లో గండిపేట మండలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించిన 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో భాగంగా రాజేంద్రనగర్ పరిధిలోని బండ్లగూడ జాగిర్ లో గండిపేట నూతన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తున్న నేపథ్యంలో దానిని సమర్థవంతంగా కట్టడి చేసేందుకు ఎక్సైజ్ శాఖకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. అందులోనే భాగంగా నూతన పోలీస్ స్టేషన్ లను ఏర్పాటు చేస్తూ నూతనంగా ఎక్సైజ్ అధికారులు మరియు సిబ్బందిని రిక్రూట్మెంట్ చేస్తున్నామన్నారు. యువత కూడా ఈ డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా వారి తల్లి దండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ కృష్ణప్రియ, డిప్యూటీ ఎక్సైజ్ సుపరిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ హౌస్ ఆఫీసర్ దేవేందర్ రావు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం అవగాహన సదస్సులు

జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం రంగారెడ్డి జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరపున జిల్లాలో 10 రోజుల పాటు నిర్వహించనున్న "అవగాహన సదస్సులు - బిఓసిడబ్ల్యూ సామాజిక భద్రత పథకాలు" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ప్రారంభించి, బిఓసిడబ్ల్యూ అవగాహన గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు పొందడానికి బిఓసిడబ్ల్యూ రిజిస్ట్రేషన్, రీన్యువల్ తప్పనిసరి అని, అందరూ నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రమాద మరణ సహాయం - ₹10,00,000, సహజ మరణ సహాయం - ₹2,00,000, వైకల్య సహాయం - ₹5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. పెళ్లి కానుక గా - ₹30,000, ప్రసూతి సహాయం - ₹30,000, హాస్పిటలైజేషన్ రిలీఫ్ - రోజుకు ₹300, నమోదు లేని కార్మికుల మరణాలకు ప్రత్యేక సహాయం - ₹50,000, ఆయుష్మాన్ భారత్ - ₹5 లక్షలు వార్షికం అందించడం చేస్తారని, కార్మికులకు ప్రధాన సంక్షేమ పథకాలు అందిస్తారని అన్నారు. ఇశ్రాం (eShram), ఇతర వెల్ఫేర్ బోర్డుల కన్వర్జెన్స్, డిజిటల్ రిజిస్ట్రేషన్ & మొబైల్ యాప్ వినియోగంపై మార్గదర్శకాలను అవగాహన చేసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టే 10 రోజుల అవగాహన కార్యక్రమం (24112025 నుండి 03122025 వరకు) అవగాహన సెషన్లు & మొబైల్ యాప్ డెమోలు, రిజిస్ట్రేషన్ & రీన్యువల్ కౌంటర్లు, బయోమెట్రిక్ వెరిఫికేషన్ యూనియన్లు , కాంట్రాక్టర్లు, స్థానిక సంస్థలతో సమావేశాలు, నిర్మాణ ప్రాజెక్టుల్లో ఫీల్డ్ సందర్శనలు, కార్మికుల ఫిర్యాదుల స్వీకరణ వంటివి ప్రతిరోజు నిర్వహించే ప్రధాన కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

**10 రోజులు రోజువారీ థీమ్‌లు**

మొదటి రోజు: కార్యక్రమ ప్రారంభం, మీడియా అవుట్‌రీచ్, రెండవ రోజు: ప్రధాన నిర్మాణ స్థలాలలో అవగాహన, మూడవరోజు : కార్మిక యూనియన్లతో సంభాషణ, నాలుగో రోజు: మండల, గ్రామపంచాయతీ సమావేశాలు, ఐదవ రోజు: రిజిస్ట్రేషన్‌రీన్యువల్ మెగా క్యాంపు, ఆరవ రోజు: మహిళా నిర్మాణ కార్మికులపై ప్రత్యేక దృష్టి, ఏడవ రోజు: భద్రత & ప్రమాద నివారణ అవగాహన, ఎనిమిదవ రోజు: పట్టణ స్థానిక సంస్థల అవుట్‌రీచ్, 9వ రోజు: వలస కూలీలపై ప్రత్యేక దృష్టి, పదవరోజు: సమీక్ష & ముగింపు కార్యక్రమం ఉంటాయని అన్నారు. అధికారులు ప్రతిరోజు కార్యకలాపాలపై నివేదికలు సమర్పించాలి, రిజిస్ట్రేషన్ కౌంటర్లపై సర్ప్రైజ్ ఇన్స్పెక్షన్లు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార చర్యలు సమీకరణ, మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. బిఓసిడబ్ల్యూ కార్మికుల సంక్షేమం కోసం రూపొందించిన ఈ 10 రోజుల అవగాహన సదస్సులు, ప్రతి కూలీకి ప్రభుత్వ పథకాలు చేరేలా చేయడమే లక్ష్యంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా కార్మిక శాఖ, యూనియన్లు, కాంట్రాక్టర్లు, స్థానిక సంస్థలు సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీత, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వినీలా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై

## అవగాహన కార్యక్రమం

ఎస్సై సందీప్ కుమార్

**వరంగల్ మహా;** వరంగల్ నగర పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం జాగృతి పోలీస్ కళా బృందం నేతృత్వంలో మధ్యాహ్నం ఇంతే జార్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరేంద్ర నగర్, కాశీబుగ్గ లోని ప్రభుత్వ హై స్కూల్ యందు ఎస్ఐ సందీప్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు, ఈవ్ టీజింగ్, డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఒక వేళ అమ్మిన, సేవించిన చట్టరిత్యా నేరమని వీటి పై ఎటువంటి సమాచారం తెలిసిన ఈ మొబైల్ నంబర్ కు 8712584473 అందించాలని, సైబర్ మోసాల బారిన పడవద్దని, అలాగే చదువు పై శ్రద్ధ పెట్టాలని, రోడ్డు ప్రమాదాలు,డయల్ 100, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫింగ్ గురించి వివరిస్తూ ముఖ్యంగా తల్లితండ్రులు చెప్పిన మాటలు విని చదువుల పై శ్రద్ధ వహించాలని అలాగే ఆడ పిల్లలు సమాజంలో ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా అపదలో డయల్ 100 కు కాల్ చేయాలని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేయాలని సూచించారు. పలు సామాజిక అంశాల పై పోలీస్ జాగృతి కళా బృందం వారు ఆలపించిన పాటలు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేసాయి. ఈ కార్యక్రమంలో ఇంతేజార్గంజ్ ఎస్ఐ రోహిత్, ఇంచార్జీ హెడ్ మాస్టర్ సరోజినీ, అధ్యాపక బృందం, బ్లూ కోట్ కానిస్టేబుల్స్ ఆఫీసర్స్, కళా బృందం సభ్యులు, హెడ్ కానిస్టేబుల్స్ , విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, హోమ్ గార్డ్స్ శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి, హై స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు 200 మంది పాల్గొన్నారు.




## డివిజన్ సమస్యలపై స్పందించని బల్దియా

### ప్రజలతో కలిసి బల్దియా ఎదుట కార్పొరేటర్ ధర్నా



**వరంగల్ మహా;** వరంగల్ నగరం 40వ డివిజన్ లోని ఉప్పరోని కుంట వద్ద బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో అధికారులు 15 రోజుల్లోగా పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో 15 రోజుల గడువు పూర్తయ్యాక బల్దియా ముందు స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి ఈనెల 10వ తేదీ గ్రీవెన్స్ లో నేరుగా కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. కాగా ఇప్పటివరకు డ్రైన్ పనులు ప్రారంభించకపోగా అధికారుల నుండి ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదు. దీంతో చేసేది ఏమీ లేక కార్పొరేటర్ రవి తాను హెచ్చరించిన విధంగానే స్థానిక ప్రజలతో కలిసి గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం జరుగుతున్న క్రమంలో కౌన్సిల్ హాల్ ఎదుట కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో ప్రజా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ మహా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా గత మూడు సంవత్సరాల నుండి ఉర్సు ఉప్పరోని కుంట స్మశాన వాటిక మురుగునీటి తో మునిగి ఉండి స్థానికంగా ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలు చేయలేని దుర్భరమైన స్థితి నెలకొన్నదని ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు దుర్వాసనతో అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో భారీ వర్షాలకు పూర్తిస్థాయిలో బాక్స్ డ్రైన్ నిర్మాణం జరగనందున వరద నీరు అంతా ఉర్సు ఉప్పరోని కుంట వద్ద ఉన్న హిందూ స్మశాన వాటిక తాళ్ల పద్మావతి కాలేజీ డీకే నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ కురుమ స్మశానవాటిక తో పాటు కొత్త కుమ్మరి వాడ ఉప్పరోని కుంట లోని కాలనీలు మునిగిపోతున్నాయన్నారు. స్థానిక సమస్యలపై స్వయంగా ఒక కార్పొరేటర్ ఏ గ్రీవెన్స్ చుట్టూ ఇన్ని మార్లు తిరిగి వినతి పత్రం ఇచ్చిన అధికారులు స్పందించడం లేదు అంటే ఇక సామాన్యుని పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా నగర మేయర్, కమిషనర్ జోక్యం చేసుకొని సరైన రీతిలో మార్కింగ్ ఇప్పించి పనులు ప్రారంభించాలని టౌన్ ప్లానింగ్ నిర్లక్ష్యం వీడాలి, కమిషనర్ బయటికి రావాలి అంటూ నినాదాలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. చివరికి పోలీసు జోక్యంతో కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ ఇన్చార్జి సిపి రవీందర్ రాడేకర్ ఈ. ఈ సంతోష్ కుమార్ లు బయటకి వచ్చి దీక్ష విరమించమని కోరగా వినతిపత్రం తీసుకొని మూడు రోజులలో స్థలాన్ని పరిశీలించి మార్కింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. అంతలోనే మేయర్ గుండు సుధారాణి తన చాంబర్లోకి రాగానే ఆందోళన కారులు కార్పొరేటర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో మేయర్ కు కూడా వినతిపత్రం ఇవ్వగా వెంటనే స్పందించి టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ అధికారులకు అక్కడి పరిస్థితులను తెలుసుకొని అధికారులు వెంటనే వెళ్లి స్మశాన వాటిక లోకి మురుగునీరు వెళ్లకుండా మార్కింగ్ ఇవ్వడంతో పాటు పరులు త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ ధర్నా కార్యక్రమంలో స్థానిక నాయకులు మాచర్ల దీన్ దయాల్ అవునూర్ కుమార్ స్వామి బైరి నాగరాజు పూజారి విజయ్ ఆవునూరి రామ్మూర్తి చింతకింది రాజు ఆవునూరి నాగరాజు వనం కుమార్ కూరపాటి రాజన్ బాబు పాపయ్య కేడల ప్రసాద్, మరుపల్ల గౌతమ్ ఎలుగల మానస నాంపల్లి అంజలి కాసర్లపల్లి సరస్వతి తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

నార్సింగి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మై హోమ్ గ్రూప్ కు చెందిన

## 70 మంది డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ కార్యక్రమం



**గండిపేట,మహా:** ట్రాఫిక్ నిబంధనలు, భద్రత పాటించడంపై నార్సింగ్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించారు. అందులోనే భాగంగా సోమవారం మధ్యాహ్నం నార్సింగ్ మున్సిపాలిటీలోని మై హోమ్ 99 మరియు నియో పోలీస్ వద్ద మై హోం గ్రూప్ కి చెందిన సుమారు 70 మంది డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో మాదాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసిపి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఎస్.హెచ్.ఓ టి.ఆంజనేయులు,ఎస్ఐ. పి రాజేష్ గౌడ్ మరియు ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ టిటిఐ సిబ్బంది వెంకటేష్, రాఘవేందర్, ప్రదీప్ లు ట్రాఫిక్ నియమ నిబంధనలను డ్రైవర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్ మరియు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించకుంటే జరిగే ప్రమాదాలు తద్వారా జరిగే అనర్థాలు తదితర అంశాలను డ్రైవర్లకు అధికారులు కూలంకషంగా వివరించారు. అంతేకాకుండా ఈ నిబంధనలు నిత్యం తప్పక పాటిస్తూ వాహనాలను జాగ్రత్తగా నడపాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మై హోమ్ విజిలెన్స్ హెడ్ ప్రమోద్, చీఫ్ సెక్రటరీ ఆఫీసర్ సుధాకర్, మరియు సి.ఎస్.ఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసమే ప్రజా ప్రభుత్వం

- రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే
- అబ్దుల్లాపూర్ మెట్టులో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రైతు సంక్షేమం కోసం నిరంతరం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే రంగారెడ్డి వెల్లడించారు. సోమవారం అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని బాటసింగారం రైతు సేవ సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులు తమ రుణాలను సకాలంలో చెల్లించి మళ్లీ రుణాలు పొందాలని సూచించారు. రైతు భరోసా ఇస్తూనే రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని అన్నారు. పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నవారి నుంచి రుణాలు వసూలు చేయాలని.. పేద మధ్యతరగతి వాళ్ళని ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. రైతులకు నేను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్టు మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, మహిళను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.

**మహిళలకు నాణ్యమైన చీరల పంపిణీ....**

గతంలో కన్నా నాణ్యమైన చీరలను కాంగ్రేస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇస్తుందని చెప్పారు.. రాబోయే రోజుల్లో అన్ని పథకాలను పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని మండిపడ్డారు. విడతల వారీగా నిధులు మంజూరు చేస్తూ ప్రతి పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, సింగిల్ విండో డైరెక్టర్లు, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం..

గ్రామ పేద ప్రజలకు అండగా నిలుస్తున్న మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం)

**మొయినాబాద్ మహా:** మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి గ్రామంలోని పేద ప్రజలకు అండగా నిలుస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) మొయినాబాద్ మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామానికి చెందిన బొర్రా బుచ్చయ్య సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ తన భార్యకు ఆర్థిక సహాయముగా పదివేల రూపాయలను అందజేసిన గ్రామ మాజీ సర్పంచ్ రాంచెందర్ (రత్నం) ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపద్బాంధవుడిగా బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాను దేవుడు వారి కుటుంబానికి ధైర్యం ఇవ్వాలని భాగోద్వేగంతో పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ ఇచ్చిన చేయూతపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాములు, పెంటయ్య, యాదయ్య, ప్రహ్లాద్, కార్తీక్, ప్రశాంత్, రాజేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీంభరత్

**మొయినాబాద్ మహా:** తెలంగాణలోని ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిరుపేదలకు గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను దశలవారిగా కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ.. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో అధిక స్థానాలు గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలోపార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహిళా శక్తి చీరల పంపిణీ చేసిన

## ఎమ్మెల్యే కాలె యాదయ్య

పాల్గొన్న గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. స్వయం సహాయక సంఘాల మహిళలకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డిలు కలిసి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. మహిళలను ఉన్నత స్థాయిలో ఉంచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చిందని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వేలాది గృహిణులకు ఆనందం కలిగిస్తుందని ప్రతి మహిళకు గౌరవం సంతోషం చేరేలా ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టడం శుభపరిణామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలందరికీ చీరలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఫిషర్మెన్ మహేందర్ ముదిరాజ్, పల్లగోల్ల అశోక్ యాదవ్, పట్నం రాంరెడ్డి, నేరేట్ల రాజు గౌడ్, గడ్డం వెంకట్ రెడ్డి, జంగయ్య, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి చారి, మండల అభివృద్ధి అధికారి సంధ్య, మహిళలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అప్పు ఎంత చేయొచ్చు..?

**"అప్పులేని వాడే అధిక సంపన్నుడు" అన్నాడు కవి వేమన. కానీ ఆధునిక అవసరాలు అనివార్యమైన నేటి రోజుల్లో "అప్పు ఎంత చేయొచ్చో తెలిసినవారు అధిక సంపన్నులు" అంటున్నారు ఆర్థిక నిపుణులు. పేదవారి నుంచి సంపన్నుల వరకూ అప్పు చేయనిదే పూట గడవదంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఎవరి స్థాయిలో వారు ఏదో ఒక రూపంలో అప్పులు చేసుకుంటూ పోతున్నారు. ఇక సగటు మధ్యతరగతి జీవితంలో అప్పు నిత్యకృత్యమే.**



నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువుల వ్యయాలు పెరిగిపోయాయి. దీంతో అప్పుల తిప్పలు తప్పడం లేదు. అయితే జీవన శైలిలో మార్పుల కారణంగా కొన్ని అప్పులు అనవరంగా వచ్చి మీద పడుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి రుణ బాధ్యతలను మరింత దగ్గరగా పర్యవేక్షించుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అస్సలు అప్పు లేకుండా ఉండటం మంచిదే. అయితే, కొన్నిసార్లు ముఖ్యంగా ఇల్లు, వాహనాల కొనుగోలు లేదా ఉన్నత విద్య వంటి వాటి కోసం అప్పు ఆచరణాత్మక అవసరం.

### తు.చ.తప్పకూడని అప్పు సూత్రం

ఆర్థికంగా ఆరోగ్యంగా ఉండటానికి, నిపుణులు ఒక క్లిష్టమైన నియమాన్ని నొక్కి చెబుతారు. అదే ఒక నెలలో ఈఎంఐలు (EMI), చేబదుళ్లు వంటివాటి కోసం వెళ్లే మొత్తం ఒక వ్యక్తి స్థూల నెలవారీ ఆదాయంలో 36 శాతానికి మించకూడదు. రుణం ఆదాయ నిష్పత్తి అని పిలిచే ఈ పరిమితిని తిరిగి చెల్లింపు సామర్థ్యాన్ని కొలవడానికి బ్యాంకులు విస్తృతంగా ఉపయోగిస్తాయి. అప్పు దీన్ని మించితే రుణగ్రహీత బడ్జెట్ ను ఒత్తిడి చేస్తుంది. దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తుంది.

### ముఖ్యంగా యువతకు..

ఈ అప్పు సూత్రం యువతకు ముఖ్యమైంది. సులభమైన క్రెడిట్ ఆప్షన్లు, ఒక్క స్క్రీన్ ట్యాప్‌తో అందుబాటులో ఉన్న తక్షణ రుణాలతో నిండిన ఆర్థిక దృశ్యంలోకి దేశ యువత ప్రవేశిస్తున్నారు. సామాజిక ఒత్తిళ్లు, ఆన్ లైన్ షాపింగ్, దూకుడు మార్కెటింగ్ తరచుగా ఆదాయానికి మించి ఖర్చు చేయిస్తుంటాయి. ఫలితంగా, చాలా మంది యువ సంపాదనాపరులు జీవితం ప్రారంభంలోనే అధిక వడ్డీ రుణాల ఉచ్చులో పడతారు. వయసు 20, 30ల ప్రారంభంలోనే ఆరోగ్యకరమైన రుణ అలవాట్లను అలవరచుకోవడం దీర్ఘకాలికంగా సంపద సృష్టిని గణనీయంగా ప్రభావితం చేస్తుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

## అప్పునకు దూరంగా ఉండటానికి మార్గాలు

మీ మొదటి ఉద్యోగం ప్రారంభం నుంచే ఈఎంఐ-టు-ఇన్‌కమ్ నిష్పత్తిని ట్రాక్ చేయండి. ఆదాయం పెరిగినప్పటికీ, ఈఎంఐలు మీ స్థూల జీతంలో 36% మించకుండా చూసుకోండి. లైఫ్ స్టైల్ అప్ గ్రేడ్ చేయడానికి ముందు అత్యవసర నిధిని నిర్మించుకోండి.యువత తరచుగా ఖర్చు చేయడానికి అనుకూలంగా పొదుపును దాటవేస్తారు. సంక్షోభ సమయంలో ఎక్కువ రుణాలు తీసుకోకుండా ఉండటానికి ఈ ఎమెర్జెన్సీ ఫండ్ అవసరం. క్రెడిట్ కార్డులు లేదా ఇప్పుడు కొని తర్వాత చెల్లించే యాప్‌ల ద్వారా హఠాత్తు కొనుగోళ్లను నివారించండి. బై-నౌ-పే-లేటర్ సర్వీసులు యువ వినియోగదారులలో ప్రాచుర్యం పొందాయి. కానీ ఊహించని రుణ ఉచ్చులను సృష్టించగలవు. విద్యా రుణాలను తెలివిగా ఎంచుకోండి. సైన్ అప్ చేయడానికి ముందు వడ్డీ రేట్లు, తిరిగి చెల్లించే ఎంపికలు, మారటోరియం కాలాలను పోల్చి చూసుకోండి. బడ్జెట్‌ను రూపొందించుకోవడం అలవాటు చేసుకోండి. కొన్ని యాప్‌లు ఖర్చులను ట్రాక్ చేయడంలో సహాయపడతాయి. ఒక సాధారణ నెలవారీ బడ్జెట్ అధిక ఖర్చును నిరోధిస్తుంది. పొదుపును ప్రోత్సహిస్తుంది. అధిక వడ్డీ రుణంపై దృష్టి పెట్టండి. వడ్డీని నివారించడానికి మొదట క్రెడిట్ కార్డు బకాయిలను క్లియర్ చేయండి. అదనపు ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకోండి. ఫ్రీలాన్సింగ్, పార్ట్ టైమ్ వర్క్ లేదా డిజిటల్ గిగ్ లు ఆరోగ్యకరమైన రుణ-ఆదాయ నిష్పత్తిని నిర్వహించడంలో సహాయపడతాయి. ప్రతిదానికీ ఫైనాన్స్ చేయడానికి బదులుగా పెద్ద కొనుగోళ్లను ప్లాన్ చేయండి. అది బైక్, ఫోన్ లేదా విహారం అయినా. మొదట పొదుపు చేయడం ఈఎంఐలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది.

# ఎంఎస్ఎంఈ రంగాల కోసం సరికొత్త యాప్




భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న & మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. పనిచేసే స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన నేషనల్ ఇండస్ట్రీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (NIRDC), MSME వాడుక, పరిధిని పెంచడానికి దేశీయంగా రూపొందించిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ InDApp రూపకల్పనను నేడు ప్రకటించింది. అంతర్జాతీయంగా పోటీతత్వ భారతీయ బ్రాండ్‌లను సృష్టించడం, భారతీయ కళాకారులు మరియు చేతివృత్తులవారికి ప్రపంచ గుర్తింపును అందించడం మరియు MSMEలు వికసిత్ భారత్ దార్శనికతకు దోహదపడేలా చేయడం లక్ష్యంగా దేశవ్యాప్తంగా B2B మార్కెట్‌ప్లేస్ నిర్మించబడింది. ఎనిమిది మంత్రిత్వ శాఖల మద్దతుతో, InDApp, భారతదేశం అంతటా MSME రంగంలోని వ్యవస్థాపకుల కోసం ప్రత్యేకంగా సృష్టించబడింది. ఈ ప్లాట్‌ఫామ్ అందించే సేవలు విస్తృత శ్రేణిలో ఉన్నాయి, ప్రభుత్వ పథకాల గురించి సమాచారాన్ని అందించడం, మూలధనాన్ని యాక్సెస్ చేయడం నుంచి వ్యాపార దృశ్యమానతను పెంచడం.. శిక్షణ, సామర్థ్య నిర్మాణానికి సహాయం చేయడం వరకు, IndApp ఒక బటన్ క్లిక్ చేయడం ద్వారా లేదా మీ ఫోన్‌లో ట్యాప్ చేయడం ద్వారా MSMEలకు డిజిటల్ యాక్సెస్‌ను గణనీయంగా పెంచుతుంది. ఈ యాప్ దాని బహుళ ఉపయోగకరమైన విలువ కారణంగా MSME రంగంలో సాంకేతిక విప్లవంగా పరిగణించబడుతుంది. భారతదేశంలోని మారుమూల ప్రాంతం నుంచి వస్తువుల వ్యాపారం చేసే భారతీయ వ్యాపారానికి, InDApp యొక్క మార్కెట్‌ప్లేస్ అంటే వ్యాపారి ప్రత్యేక వర్గం కింద ఉత్పత్తులు మరియు సేవలను పొందుపరచవచ్చు మరియు ఇతర ప్రాంతాలలో వ్యాపారాలను కూడా అన్వేషించవచ్చు. ఈ అప్లికేషన్‌ను రూపొందించిన నోడల్ బాడీగా, వనరులు మరియు మద్దతు విధానాలకు యాక్సెస్‌ను క్రమబద్ధీకరించడానికి NIDRC ఇతర ప్రభుత్వ సంస్థలతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తుంది. ఈ సహకార వ్యవస్థ, పారిశ్రామిక సౌకర్యాలు మరియు విధాన అమలుకు సమగ్రమైన మరియు పరిపూర్ణమైన విధానం ఉందని నిర్ధారిస్తుంది.

# బిలినీయర్స్ అంతా ఒక్కచోట!



అసాధ్యం అనుకున్న చాలా విషయాలను ఏఐ సాధ్యం చేస్తోంది. టెక్ బిలియనీర్లు అందరూ ఒక్క చోటకు చేరిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఏఐ చేసిన ఈ అద్భుతంపై.. నెట్టింట్లో మీమ్స్, జోకులు వెల్లువెత్తుతున్నాయి. 1 ట్రిలియన్ స్క్వాడ్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలో.. ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, సుందర్ పిచాయ్, జెన్సెన్ హువాంగ్, సామ్ ఆల్ట్‌మాన్, టిమ్ కుక్, జెఫ్ బెజోస్‌లు అందరూ ఒకేచోట ఉన్నారు. ఈ ఫోటోలు మస్క్ కొత్త గ్రోక్ అప్‌డేట్ ప్రకటనను తెలియజేయడానికే అని కొందరు చెబుతున్నారు. ఒక ఫొటోలో.. ఎలాన్ మస్క్ సహా చాలామంది దిగ్గజ వ్యాపారవేత్తలు కార్ పార్కింగ్ వద్ద సమావేశమైనట్లు కనిపిస్తున్నారు. మరో చిత్రంలో అందరూ కలిసి ఒక రూములో ఉన్నట్లు చూడవచ్చు. నిజజీవితంలో వీరంతా కలుసుకోవడం చాలా అరుదు అయినప్పటికీ.. ఏఐ మాత్రం వీరిని కలిపింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

# భారత్ కోసం మరో కియా..



గ్లోబల్ మార్కెట్లలో అమ్ముడవుతున్న.. మూడు వరుసల SUV కియా సొరెంటో మొదటిసారి భారతదేశంలో టెస్టింగ్ సమయంలో కనిపించింది. కంపెనీ ఎంక్యూ4ఐ అనే కోడ్‌నేమ్‌తో దీనిని ఇండియాలో లాంచ్ చేయనుంది. ఇది మహీంద్రా XUV700, టాటా సఫారీ కార్లకు ప్రత్యర్థిగా ఉంటుంది. టెస్టింగ్ సమయంలో కనిపించిన కియా కొత్త కారు.. టెస్ట్ మ్యూల్. ఇది 235/55 R19 టైర్లతో 19అంగుళాల అల్లాయ్ వీల్స్ & బాక్సీ సిల్హౌట్ పొందుతుంది. లోపల ఒక రోటరీ గేర్ సెలెక్టర్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌ను సూచిస్తుంది. క్యామోపేజ్ ఉన్నప్పటికీ.. మూడు వరుసల మోడల్ అని స్పష్టంగా తెలుస్తుంది. ముందు భాగంగా నిలువుగా అమర్చిన టీ షేప్ లైటింగ్, వెనుక భాగంలో కనెక్టెడ్ టెయిల్ లాంప్‌లు ఉన్నాయి. ఫీచర్స్ విషయానికి వస్తే.. టెస్టింగ్ మోడల్ కారులో ఇవి బహిర్గతం కాలేదు. కానీ 12.3అంగుళాల డిస్ప్లేలు, పనోరమిక్ సన్‌రూఫ్, రియర్ విండోలు, టెయిల్‌గేట్ కోసం ప్రైవసీ గ్లాస్, పవర్డ్ అండ్ వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 360 డిగ్రీ కెమెరా, హెడ్‌అప్ డిస్ప్లే మొదలైనవి ఉండనున్నాయి. పవర్‌ట్రెయిన్ వివరాలకు కూడా అధికారికంగా వెల్లడికాలేదు. కానీ అంతర్జాతీయ మార్కెట్లో అందుబాటులో ఉన్న కియా సోరెంటో మూడు ఇంజన్ ఎంపికల లభిస్తుంది. అవి 1.6లీటర్ టర్బోపెట్రోల్ హైబ్రిడ్, 1.6లీటర్ టర్బోపెట్రోల్ ప్లగ్‌ఇన్ హైబ్రిడ్, 2.2లీటర్ డీజిల్ హైబ్రిడ్ ఇంజిన్లు. అన్ని వేరియంట్లు ఆల్ వీల్ డ్రైవ్ ఆప్షన్ పొందుతాయి. అయితే మన దేశంలో లాంచ్ అయ్యే సోరెంటో ఏ ఇంజిన్ ఆప్షన్స్ పొందుతుందనే విషయం తెలియాల్సి ఉంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# యూఎస్ శాంతి ప్రణాళికపై జెనీవాలో చర్చలు

**పాల్గొన్న ఉక్రెయిన్, యూరప్, అమెరికా ప్రతినిధులు**

**జెనీవా:** రష్యా దురాక్రమణకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఉద్దేశించిన అమెరికా ప్రతిపాదిత శాంతి ఒప్పందంపై ఉక్రెయిన్, పశ్చిమ దేశాల ప్రతినిధులు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఆదివారం చర్చలు జరిపారు. యూకే, ఫ్రాన్స్, జర్మనీ జాతీయ భద్రతా సలహాదారులతో మొదటి దఫా చర్చలు ముగిశాయని ఉక్రెయిన్ బృందానికి నాయకత్వం వహిస్తున్న అధ్యక్షభవనం చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఆండ్రీ యర్మాక్ ఎక్స్‌లో వెల్లడించారు. ప్రతిపాదిత 28 పాయింట్ల ఒప్పందం పొరుగుదేశంపై దురాక్రమణకు పాల్పడిన రష్యాకే అనుకూలంగా ఉండటంపై యూరప్ దేశాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపాదనలను సమీక్షించేలా అమెరికాపై ఒత్తిడి తేవాలని ఉక్రెయిన్‌ను అవి కోరుతున్నాయి. ఈ చర్చల్లో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ కూడా పాలుపంచుకున్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనే దిశగా అమెరికా బృందంతో నిర్మాణాత్మకంగా చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని యర్మాక్ తెలిపారు. ఈ ఒప్పందంతో దేశ సార్వభౌమత్వమా? అమెరికా మద్దతును నిలుపుకోవడమా? తేలిపోనుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించడం తెల్సిందే. ఇప్పటికే కనీసం డజను సార్లు తిరస్కరించిన రష్యా డిమాండ్లనే ఈ ఒప్పందంతో ఆమోదించాల్సి రావడం జెలెన్‌స్కీకి మింగుడు పడటం లేదు. ఉక్రెయిన్ పారిశ్రామిక రంగానికి ఎంతో కీలకమైన డోన్బాస్‌ను రష్యాకు వదిలేయడం, సైన్యాన్ని పరిమితం చేసుకోవడం వంటివి ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఇవి తుది ప్రతిపాదనలు కావని, ఎలాగైనా యుద్ధాన్ని ఆపడమే తమ లక్ష్యమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. అయితే, గురువారం కల్లా ఒక స్పష్టతకు రావాలని ఆయన శనివారం ఉక్రెయిన్‌కు గడువు విధించారు. కాగా, నల్ల సముద్రంపై ఉక్రెయిన్ స్వేచ్ఛగా ధాన్యం రవాణా చేసేందుకు ఉద్దేశించిన గత ఒప్పందాన్ని అమల్లోకి తెచ్చేలా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సోమవారం మాట్లాడుతానని తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్ చెప్పారు.

# సీఎం సీటు నుంచి దిగేందుకు సిద్ధం?!



నాయకత్వ మార్పుపై ఊహాగానాలు నడుస్తున్న వేళ.. కర్ణాటక రాజకీయంలో బడా ట్విస్ట్ చోటు చేసుకుంది. సీఎం మార్పు ఉండొచ్చనే సంకేతాలను బలపరిచేలా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానంటూ ఇంతకాలం పదేపదే చెబుతూ వచ్చిన ఆయన.. ఇవాళ సరికొత్తగా మాట్లాడడం కన్నడనాట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సోమవారం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ.. ''కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయిస్తే.. ఐదేళ్లు సీఎంగా కొనసాగుతాను. ఒకవేళ సీఎంను మార్చి తీరాలని అధిష్టానం భావిస్తే అందుకు కట్టుబడి ఉంటాను. నేను మాత్రమే కాదు.. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా దీనిని అంగీకరించాల్సి ఉంటుంది'' అని అన్నారాయన. నవంబర్ 20వ తేదీన నుంచి కర్ణాటక రాజకీయాలు వేడెక్కిన సంగతి తెలిసిందే. 2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్.. పవర్ షేరింగ్ ఫార్ములా ద్వారా సీఎం రేసులో ఉన్న సిద్ధూ, డీకేశిలను చల్లార్చిందనే ప్రచారం ఒకటి ఉంది. రెండున్నరేళ్లు పూర్తి కావడంతో డీకే మద్దతుదారులు ఆయనకు సీఎం పగ్గాలు అప్పగించాలని గళం వినిపిస్తుండగా.. అనుభవాన్ని,సామాజిక వర్గాల సమీకరణలను పరిగణనలోకి తీసుకుని కొనసాగించాలంటూ సిద్ధరామయ్య మద్దతుదారులు ఢిల్లీ పెద్దల వద్దకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో.. డీకే శివకుమార్‌కు శిబిర ఎమ్మెల్యేల సంఖ్య పరిమితంగా ఉండడంతో ఈ మార్పునకు అధిష్టానం సుముఖంగా లేదని నిన్నటిదాకా ప్రచారం వినిపించింది. అయితే.. అనూహ్యంగా ఆయనకు మద్దతుదారుల సంఖ్య పెరిగిపోతూ వస్తోంది. వాళ్లంతా మరోసారి ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో.. ఇటు సిద్ధరామయ్య కూడా సీఎం సీటు నుంచి దిగేందుకు సిద్ధమంటూ తాజాగా ప్రకటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### అంతా వాళ్ల చేతుల్లోనే..

కర్ణాటకలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ(పీసీసీ చీఫ్ మార్పు సహా) చేపట్టాలని సిద్ధరామయ్య తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే సీఎం సీటు పంచాయితీ తేల్చిన తర్వాతే ఆ పని చేయాలంటూ డీకే శివకుమార్ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో.. ''నాలుగైదు నెలల కిందటే హైకమాండ్ నుంచి కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు తనకు గ్రీన్‌సిగ్నల్ లభించిందని.. అయితే రెండున్నరేళ్ల పాలన పూర్తి అయ్యేదాకా ఆగాలని భావించానని'' సిద్ధరామయ్య ఇవాళ మీడియాకు తెలిపారు. అయితే.. పవర్ షేరింగ్ ఫార్ములా(రెండున్నరేళ్ల తర్వాత సీఎం సీటు వదులుకునేందుకు సిద్ధపడ్డారా?) అనేది ఒకటి ఉందా?.. అందుకు మీరు అంగీకరించారా? అని రిపోర్టర్లు అడిగిన ప్రశ్నకు.. అంతా హైకమాండ్ చేతుల్లోనే ఉంటుంది అంటూ దాటవేత ధోరణి ప్రదర్శించారాయన.

## ఆయన వస్తేనే..

**కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను డీకే శివకుమార్‌తో రీప్లేస్ చేయాలంటూ కొంత కాలంగా నడుస్తున్న రాజకీయాలతో ఢిల్లీ వేడెక్కుతోంది. ఇప్పటికే డీకే శివకుమార్ వర్గీయులు హైకమాండ్‌తో సంప్రదింపులు జరిపారు. మరోవైపు.. శనివారం సిద్ధూ వర్గం ఎడతెరిపి లేకుండా బెంగళూరు పర్యటనకు వచ్చిన ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో మంతనాలు జరిపింది. అయితే.. అంతిమ నిర్ణయం అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల్లోనే ఉందంటూ ఖర్గే వాళ్లతో తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బెంగళూరు పర్యటనలో ఉన్న ఖర్గే ఢిల్లీకి తిరుగుపయనం కానున్నారు. రాహుల్ గాంధీ విదేశీ పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన వచ్చాకే కర్ణాటక కాంగ్రెస్ సంక్షోభం ఓ కొలిక్కి రావొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.**

# పెషావర్‌లో ఆత్మాహుతి దాడి.. ముగ్గురు మృతి



**పెషావర్:** పాకిస్తాన్‌లోని పెషావర్ ఉద్రిక్తతలతో అట్టుడుకుతోంది. ఈరోజు (సోమవారం) ఉదయం ఇక్కడి ఫ్రాంటియర్ కార్ప్స్ (ఎఫ్‌సీ)పారామిలిటరీ దళ ప్రధాన కార్యాలయంపై ముష్కరులు, ఆత్మాహుతి బాంబర్లు దాడి చేయడంతో ఆ ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. రాయిటర్స్ నివేదికల ప్రకారం ఈ భీకర దాడిలో ముగ్గురు మృతి చెందినట్లు పోలీసు అధికారులు ధృవీకరించారు. ఈ సమన్వయ దాడి అనంతరం భద్రతా దళాలు అప్రమత్తమై, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాయి. దాడుల వెనుక ఇద్దరు ఆత్మాహుతి బాంబర్లు ఉన్నారని రాయటర్స్ పేర్కొంది. దాడి వ్యూహంలో భాగంగా తొలుత ఆత్మాహుతి బాంబర్ ప్రధాన కార్యాలయం ముఖద్వారంపై దాడి చేసి, తనను తాను పేల్చుకోగా, ఆ వెంటనే మరొక బాంబర్ దళాల దృష్టిని మళ్లించి, ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆవరణలోకి ప్రవేశించినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఈ దాడి సమయంలో రెండు భారీ పేలుళ్లు సంభవించాయని, వెంటనే భారీగా కాల్పుల శబ్దాలు వినిపించాయని స్థానికులు సోషల్ మీడియాలో వెల్లడించారు. దాడి జరిగిన వెంటనే చట్ట అమలు సిబ్బంది, సైన్యం, పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, ఆ ప్రాంతాన్నంతా చుట్టుముట్టారు. ప్రధాన కార్యాలయం లోపల ఇంకా కొందరు ఉగ్రవాదులు ఉండవచ్చని , పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా భద్రతా దళాలు ఘటన జరిగిన వెంటనే ఎఫ్‌సీ ప్రధాన కార్యాలయం వెలుపలి రహదారిని మూసివేసి, ఆ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశాయి. పెషావర్‌లోని పారామిలిటరీ ప్రధాన స్థావరంపై జరిగిన ఈ ఆత్మాహుతి దాడి, దేశ భద్రతకు పెను సవాలుగా పరిణమించింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నిర్బంధ ఆపరేషన్ కొనసాగుతోంది. ఈ ఉగ్రవాదులను నిలువరించేందుకు భద్రతా బలగాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

# రూ.5వేల కోట్లు చెల్లించండి.. సందేసర సోదరులకు సుప్రీం ఆదేశాలు!



న్యూఢిల్లీ: గుజరాత్ వ్యాపారవేత్తలు సందేసర సోదరుల ఆర్థిక కుంబకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పలు బ్యాంకుల వద్ద రుణాల ఎగవేతకు పాల్పడిన సందేసర సోదరులు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు అంగీకరించారు. వారి విజ్ఞప్తికి సుప్రీం కోర్టు అంగీకరించింది. డిసెంబర్ 17లోపు ఆ మొత్తాన్ని చెల్లిస్తే వారిపై నమోదైన అన్నీ క్రిమినల్ కేసులపై విచారణ నిలిపివేస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. నితిన్ సందేసర, చేతన్ సందేసర, దీప్తి సందేసర ఇతర కుటుంబ సభ్యులు స్టెర్లింగ్ బయోటెక్ లిమిటెడ్ అనే కంపెనీని ప్రమోట్ చేశారు. ఈ సంస్థ భారత్‌తో పాటు, విదేశీ బ్యాంకుల్లో విదేశీ శాఖల నుంచి రూ. 13వేల కోట్లుకు (అంచనా)పైగా రుణాలు తీసుకున్నారు. ఆ రుణాలను డొల్ల కంపెనీల ద్వారా విదేశాలకు మళ్లించి, బ్యాంకులకు నష్టం కలిగించారని కేంద్ర దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఈ కేసు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) స్కామ్ కంటే పెద్దదిగా భావించబడుతోంది. పీఎన్‌బీ స్కామ్ (నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ) సుమారు రూ. 13,500 కోట్లుకాగా.. సందేసరా బ్రదర్స్ స్కామ్ రూ. 14,000 కోట్లకు పైగా ఉంది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలోనే అతిపెద్ద మోసాలలో ఒకటిగా పరిగణలో ఉంది. స్టెర్లింగ్ బయోటెక్ సంస్థపై పదుల సంఖ్యలో ఆర్థిక నేరానికి పాల్పడ్డారనే కేసులు నమోదయ్యాయి. వాటిపై సుప్రీం కోర్టులో సుదీర్ఘంగా విచారణ జరుగుతూ వస్తోంది. ఈక్రమంలో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల్ని తిరిగి చెల్లిస్తామని సందేసర సోదరులు ముందుకు వచ్చారు. ఇదే అంశంపై జరిగిన విచారణలో సందేసర సోదరుల విజ్ఞప్తికి సుప్రీం కోర్టు సమ్మతి తెలిపింది. డిసెంబర్ 17 లోగా వారు రుణదాత బ్యాంకులకు రూ.5,100 కోట్ల వన్ టైమ్ సెటిల్‌మెంట్ చెల్లించాలనే షరతు విధించింది. ఈ సందర్భంగా సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది. నితిన్ సందేసర,చేతన్ సందేసర సహ నిందితులపై సీబీఐ,ఈడీ,పీఎంఎల్ఏ కింద దాఖలు చేసిన అన్ని కేసులను సెటిల్‌మెంట్ మొత్తాన్ని డిపాజిట్ చేసిన తర్వాత క్రిమినల్ విచారణ నిలిపివేస్తామని ఉత్తర్వులో పేర్కొంది. ఆ ఉత్తర్వులో, ప్రజాధనాన్ని తిరిగి పొందడం ప్రాథమిక లక్ష్యం అని బెంచ్ నొక్కి చెప్పింది. మోసం చేసిన మొత్తాన్ని తిరిగి ఇస్తే నేరారోపణలను పొడిగించడం వల్ల ప్రయోజనం ఉండదని పేర్కొంది.



# వీరు.. ఇకలేరు

బాలీవుడ్‌లో ఓ శకం ముగిసింది. హీ మ్యాన్ ధర్మేంద్ర (89) తుదిశ్వాస విడిచారు. గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఈయన.. ఇంట్లోనే కన్నుమూశారు. ఈయన మృతి విషయాన్ని ఇంకా కుటుంబ సభ్యులు బయటపెట్టలేదు కానీ ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియాలో వెల్లడించాడు. ఈ క్రమంలోనే సినీ రాజకీయ ప్రముఖులు ఈయన మరణం పట్ల సంతాపం తెలియజేస్తున్నారు. ఇంతకీ ధర్మేంద్ర ఎవరు? ఆయన జీవితంలోని విశేషాలు ఏంటనేది ఈ స్టోరీలో చూద్దాం.

ANN తెలుగు
మహా పత్రిక
25-11-2025
మంగళవారం, హైదరాబాద్
WWW.MAHAADAILY.COM



1935 డిసెంబర్ 5వ తేదీన జన్మించిన ధర్మేంద్ర అసలు పేరు ధరమ్ సింగ్ డియోల్. ధర్మేంద్ర ప్రకాశ్ కౌర్‌కు సన్నీ డియోల్, బాబీ డియోల్ సంతానం. ధర్మేంద్రహేమామాలిని ఇషా డియోల్, ఆహానా డియోల్ సంతానం. అత్యంత ప్రాచుర్యం పొందిన 'షోలే'లో వీరూ పాత్రలో ధర్మేంద్ర నటించారు. ఆ సినిమా ఆయన సినీ కెరీర్‌ను ఓ మలుపు తిప్పింది. అలీబాబా ఔర్ 40 చోర్, దోస్త్, డ్రీమ్ గర్ల్, సన్నీ, గాయల్, లోఫర్, మేరా నామ్ జోకర్ తదితర చిత్రాల్లోనూ నటించారు. రాజస్థాన్‌లోని బికనీర్ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గి ఎంపీగా కూడా పని చేశారు. ఆయన మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ధర్మేంద్ర చనిపోయినట్లు ప్రస్తుతం జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అందుకు తగ్గట్లే అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటికకు ధర్మేంద్ర భార్య హేమమాలిని, కూతురు ఈషా డియోల్, బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ వచ్చిన వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహర్.. ధర్మేంద్ర మృతి విషయాన్ని ధ్రువీకరించారు. ఇన్ స్టాలో పోస్ట్ కూడా పెట్టారు.



బాలీవుడ్‌లలో కండలు తిరిగిన సౌష్టవంతో కనిపించి ఆరోజుల్లోనే ధర్మేంద్ర ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. ఆరోజుల్లో చాలామంది అమ్మాయిల కలల రాకుమారునిగా నిలిచారు. ఏకంగా అందరి 'డ్రీమ్ గర్ల్'గా పేరొందిన హేమామాలిని అంతటి అందాలతారను ఆయన తన సొంతం చేసుకున్నారు. మేచో మేన్ గా పేరొందిన తొలినటుడిగా పేరుగాంచిన ధర్మేంద్ర.. బ్లాక్ అండ్ వైట్ కాలం నుంచీ ప్రస్తుత ట్రెండ్ వరకు తన చిత్రాలకు కలెక్షన్స్ వర్షం కురిసింది. బాలీవుడ్ నుంచి సౌత్ ఇండియా వరకు సుమారు రెండు దశాబ్దాల కాలం పాటు సినిమా పరిశ్రమలో ఎదురులేని మనిషిగా రాణించారు.

## టాలెంట్‌తో తొలి ఛాన్స్

లూధియానా సమీపంలోని లాల్టోన్ కలాన్ అనే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ధర్మేంద్ర తండ్రి ప్రధానోపాధ్యాయునిగా పనిచేసేవారు. దీంతో ఆయన అక్కడే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. చదువులు పెద్దగా చురుకుగా ఉండేవాడు కాదు. ఏదో రకంగా తన మెట్రిక్యులేషన్ పాసయ్యారు. అయితే, స్కూల్ రోజుల్లోనే స్టేజీలపై నాటకాలు వేయడం ఇష్టం. అప్పట్లో 'ఫిలిమ్ ఫేర్' మేగజైన్ కొత్తవారి టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆ పోటీలో ధర్మేంద్ర విజేతగా నిలవడంతో కెరీర్ మలుపు తిప్పింది. ముంబైకి వస్తే సినిమా ఛాన్సులు ఇస్తామని వారు చెప్పడంతో అటువైపు అడుగులు వేశారు. ముంబై వెళ్లిన ఆయనకు నిరాశే ఎదురైంది. కానీ, పట్టువదలకుండా అక్కడే ఉంటూ తన వేట సాగించారు. సరిగ్గా అలాంటి సమయంలోనే దర్శకుడు అర్జున్ హింగోరానీ కంటికి ధర్మేంద్ర పర్సనాలిటీ చూసి ఫిదా అయిపోయాడు. దీంతో తన సినిమాలో హీరోగా అవకాశం కల్పించారు. అలా తన మొదటి సినిమా 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే'లో మెప్పించారు. అందులో బలరాజ్ సహానీ వంటి మేటి నటునితో కలసి ధర్మేంద్ర నటించడం విశేషం. అయితే, అనుకున్నంత రేంజ్‌లో ఈ మూవీ మెప్పించలేదు. ఆ తరువాత కొన్ని చిత్రాలలో సైడ్ హీరోగానూ నటించాల్సి వచ్చింది. 1962లో విడుదలైన 'అన్ పడ్' చిత్రం సూపర్ హిట అయింది. కానీ, 1966లో వచ్చిన 'ఫూల్ ఔర్ పత్థర్' చిత్రం ధర్మేంద్రను స్టార్ హీరోను చేసింది.

## హేమమాలినితో ప్రేమ.. రెండో పెళ్లి

1970 ధర్మేంద్ర, హేమమాలినితో జోడీ మొదలైంది. వారిద్దరి కాంబినేషన్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. రాజాజానీ, సీతా ఔర్ గీతా, షరాఫత్, నయా జమానా, పత్థర్ ఔర్ పాయల్, తుమ్ హసీన్ మై జవాన్, చరస్, దోస్త్, మా, షోలే, ఆజాద్ వంటి సినిమాలు వారిద్దరి కాంబినేషన్‌లో సంచలనం రేపాయి. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. అయితే, అప్పటికే ధర్మేంద్రకు పెళ్లి అయిపోయింది. పిల్లలు కూడా ఉన్నారు. కానీ, హేమ మనసు ఆయనతో కలిసి అడుగులు వేయాలని కోరుకుంది. దీంతో వీరిద్దరూ 1980లో వివాహం చేసుకున్నారు. ఈ జోడికి జన్మించిన వారే ఇషా డియోల్, అహనా డియోల్ . ధర్మేంద్ర మొదటి భార్య ప్రకాశ్ కౌర్‌కు జన్మించిన వారిలో సన్నీ డియోల్, బాబీ డియోల్ ఉన్నారు. వారిద్దరూ కూడా హీరోలుగా మెప్పించారు. హేమామాలినితో పెళ్లి తర్వాత కూడా తన కుమారులని ఆయన దూరం పెట్టలేదు. నిర్మాతగా వారిద్దరిని హీరోలుగా పరిచయం చేస్తూ చిత్రాలు నిర్మించారు. ధర్మేంద్ర కేవలం సినిమాల్లో మాత్రమే కాదు.. రాజకీయాల్లోనూ సత్తా చాటారు. రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2012లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ఇచ్చి గౌరవించింది.

## ఆయన కేవలం నటుడు మాత్రమే కాదు

### మెగాస్టార్ చిరంజీవి సంతాపం



బాలీవుడ్ నట దిగ్గజం ధర్మేంద్ర మృతి పట్ల మెగాస్టార్ చిరంజీవి సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ట్వీట్ చేశారు. ఈ కష్ట సమయంలో నా స్నేహితులు సన్నీ డియోల్, బాబీ డియోల్ ధైర్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు పోస్ట్ చేశారు. ఆయన వారసత్వం లక్షలాది మంది హృదయాలలో సజీవంగా ఉంటుందని మెగాస్టార్ తెలిపారు. చిరంజీవి తన ట్వీట్‌లో రాస్తూ..' ధర్మజీ కేవలం ఒక దిగ్గజ నటుడు మాత్రమే కాదు.. అద్భుతమైన మనిషి కూడా. నేను ఆయనను కలిసిన ప్రతిసారీ వినయం, ఆప్యాయతను నేర్చుకున్నా. ఆయన మాటలు నా హృదయాన్ని లోతుగా తాకాయి. ఆయనతో నేను పంచుకున్న మధురమైన జ్ఞాపకాలు, వ్యక్తిగత క్షణాలను జీవితంలో ఎప్పటికీ గుర్తుంచుకుంటా. మృతికి నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నా. ఆయన వారసత్వం లక్షలాది మంది హృదయాలలో సజీవంగా ఉంటుంది. ఓం శాంతి' అంటూ సోషల్ మీడియా ద్వారా సంతాపం ప్రకటించారు.

## జూనియర్ ఎన్టీఆర్ సంతాపం



ధర్మేంద్ర మృతి పట్ల జూనియర్ ఎన్టీఆర్ సంతాపం తెలిపారు. ధర్మేంద్ర జీ మరణవార్త విని చాలా బాధపడ్డా.. ఆయన గొప్ప శకాన్ని ఎప్పటికీ భర్తీ చేయలేము.. భారతీయ సినిమాకు తీసుకొచ్చిన గొప్పతనం ఎప్పటికీ మనతో ఉంటుందని ట్వీట్ చేశారు. ఈ సమయంలో ఆయన కుటుంబానికి నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నానంటూ పోస్ట్ చేశారు. ధర్మేంద్ర మరణంతో రామ్ చరణ్ మూవీ పెద్ది టీమ్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రోజు ప్రకటించాల్సిన అనౌన్స్‌మెంట్‌ను వాయిదా వేసింది. ఇవాళ సాయంత్రం నాలుగు గంటల ఐదు నిమిషాలకు ఇవ్వాల్సిన అప్‌డేట్‌ను పోస్ట్ పోన్ చేస్తున్నట్లు పెద్ది సినిమా నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ట్వీట్ చేసింది. ధర్మేంద్ర మరణం పట్ల సంతాపం తెలిపారు మేకర్స్.

## వంద ఎకరాల ఫామ్ హౌస్.. లగ్జరీ కార్లు..



ధర్మేంద్ర మరణించడంతో ఆయన ఆస్తులపై చర్చ మొదలైంది. తన కెరీర్‌లో ఎన్ని ఆస్తులు కూడబెట్టరనే దానిపై ప్రతి ఒక్కరిలో ఆసక్తి నెలకొంది. ఓవరాల్‌గా చూస్తే ఆయన ఆస్తుల విలువ దాదాపు రూ.335 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం హీరోగానే కాదు.. తన కెరీర్‌లో హోటల్, అతిథ్యరంగంలో బిజినెస్ చేశారు. 2015లో న్యూఢిల్లీలో తన మొదటి రెస్టారెంట్ గరం ధరం ధాబాను ప్రారంభించారు. ఆ తర్వాత 2022లో, కర్నాల్ హైవేలో హీ మ్యాన్ అనే రెస్టారెంట్ ప్రారంభించారు.

### లోనావాలాలో 100 ఎకరాల ఫామ్‌హౌస్

పుణె సమీపంలోని లోనావాలాలోని అతని 100 ఎకరాల ఫామ్‌హౌస్ కూడా ఉంది. ఆయన తన కుటుంబంతో ముంబయి నుంచి ఈ ప్రశాంతమైన ప్రదేశానికి వెళ్లి వస్తుంటారు. ఈ ఫామ్‌హౌస్‌లో అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు ఉన్నాయి. అంతేకాకుండా ధర్మేంద్ర రూ. 17 కోట్ల కంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఆయన పేరిట ఉన్నాయి. రూ. 88 లక్షలకు పైగా విలువైన వ్యవసాయ భూమితో పాటు రూ. 52 లక్షల విలువైన వ్యవసాయేతర ప్లాట్స్ ఉన్నాయి. ఫామ్‌హౌస్ సమీపంలోని 12 ఎకరాల స్థలంలో ఓ రిసార్ట్‌ను అభివృద్ధి చేశారు.

### లగ్జరీ కార్లు..

లగ్జరీ కార్లు అంటే ధర్మేంద్రకు చాలా ఇష్టం. ఆయన మొదట వింటేజ్ ఫియట్ అనే కారును కొన్నారు. ఆ తర్వాత చాలా ఏళ్లకు రేంజ్ రోవర్ ఎవోక్ (రూ. 85.74 లక్షలు), మెర్సిడెస్‌బెంజ్ (రూ. 98.11 లక్షలు)ను కొనుగోలు చేశాడు. అంతేకాకుండా 1983లో ధర్మేంద్ర విజేత ఫిల్మ్స్ అనే నిర్మాణ సంస్థ స్థాపించారు. తన బ్యానర్‌లోనే కుమారులు సన్నీడియోల్, బాబీ డియోల్‌లను బాలీవుడ్‌కు పరిచయం చేశాడు. 1983లో బేతాబ్‌తో సన్నీ, 1995లో బర్సాత్‌తో బాబీ బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత తన మనవడు కరణ్ డియోల్ పాల్ పాల్ దిల్ కే పాస్ అనే మూవీతో 2019లో అరంగేట్రం చేశాడు. అలా తనతో పాటు భారతీయ సినిమాపై కుటుంబ వారసత్వం శాశ్వతంగా ఉండేలా ప్రోత్సహించారు ధర్మేంద్ర.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com